ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా
The Bombay Andhra Mahasabha & Gymkhana
10-C, Lakhamshi Napoo Road, Dadar (E), Mumbai - 400014, Tel.: 24144377 / 24144388, Fax : 24119832
E-mail: mahasabha@gmail.com Web: www.bamsg.org



దర్పణం తెలుగు భాషా, సాహితీ, సంస్కృతీ, కళల, క్రీడల వార్తా విశేషాల పత్రిక అక్టోబర్ - 2018

అధ్యక్షులు / సారధ్యం
**సంకు సుధాకర్**

ప్రధాన కార్యదర్శి / సహకారం
**తాళ్ల నరేశ్**

ఉపాధ్యక్షులు / సంపాదకులు
**నడిమెట్ల యెల్లప్ప**

సంపాదక వర్గం

బడుగు విశ్వనాథ్
ఉపాధ్యక్షులు, పరిపాలన శాఖ

గురు డా॥ రాధా మోహన్
ఉపాధ్యక్షులు, సాంస్కృతిక శాఖ

బొమ్మకంటి కైలాశ్
సంయుక్త కార్యదర్శి, పరిపాలన శాఖ

శ్రీమతి మచ్చ సుజాత
సంయుక్త కార్యదర్శి, సాంస్కృతిక శాఖ

గాజెంగి వేంకటేశ్
సంయుక్త కార్యదర్శి, సాహిత్య, క్రీడా శాఖ

బింగి సత్యనారాయణ
కోశాధికారి

**ఈ సంచికలో...** మహాసభ కార్యక్రమవివరాలు, కవితలు, కథలు, వింతలు విశేషాలు, వ్యాసాలు... వార్తలు, వినోదాలు... కార్టూన్‌లు, ఇంకా ... మీకు నచ్చే, మీరు మెచ్చే, ఎన్నో ఫీచర్స్...

**కలిసి ఉంటే కలుగు బలం**

## ముందు మాట..

**మరోసారి మీ ముందుకు..!**
**ఆత్మీయులందరికీ హార్ధిక నమస్కారములు..!!**

తెలుగు భాషా, సాహితీ, సంస్కృతుల పుణ్యక్షేత్రమైన **'ఆంధ్ర మహాసభ',** సారథులుగా మీ ముందుకు వస్తున్నాము. మహాసభ నిర్వాహణ బాధ్యతను మా మీద, మా తోటి కార్యవర్గ సభ్యుల మీద ఉంచినందుకు మీ అందరికీ సగౌరవ, సవినయ ధన్యవాదములు తెలుపుకుంటున్నాము.

కొంత కాలంగా మహాసభ కొన్ని కుదుపులకు లోనైన విషయాన్ని మనమంతా గ్రహించాం. సంస్థల నిర్వహణలో అప్పుడప్పుడు కొన్ని ఆటంకాలు కలుగుతుంటాయి. వాటికి ఎవరినో బాధ్యుల్ని చేస్తూ, కాలయాపన చేయకుండా శ్రుతిలయల సరాగాల్ని సరికొత్తగా పలికించడమే మా కర్తవ్యంగా భావించి, మీ అందరి సహాయ సహకారాలతో ముందుకు సాగుతామని మాత్రం నేను గట్టిగా చెప్పగలను.

Leadership is inspiring people. Management is keeping the trains running on time. అన్నారు పెద్దలు. గత తొమ్మిది దశాబ్దాలుగా ఎందరో పెద్దలు ఆంధ్ర మహాసభ అధ్యక్ష పదవిలో ఉంటూ ఎన్నో చిరస్మరణీయమైన పనులు చేశారు. వారికందరికీ నమస్సులు అందిస్తూ, మేము చెప్ప దలుచుకున్నది ఒక్కటే... ఎన్నికైన సభ్యులందరి, ఎంపిక చేసిన మీ అందరి, శుభకామనలు మా వెంట ఉంటే మీకు సమర్ధవంతమై **నాయకత్వం** (Leadership) తో పాటు, ఆంధ్ర మహాసభను ప్రగతి పథంలో పరుగెత్తించే **కార్య నిర్వహణ** (Management) ను కూడా అందిస్తామనీ హామీ ఇస్తున్నాము.

"When the vision is clear, the results will appear. Keep your mindset positive as you work your plan, flourish, and always remember why you started." అనే ఈ సూక్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలనుకుంటున్నాం. నిర్మాణాత్మకమైన అంశాలను తప్ప మిగతా విషయాలను పట్టించుకోమనీ, ఆంధ్ర మహాసభ మూలాల్ని మరింత పదిల పరచడం, ఆంధ్ర మహాసభను ఆధునిక అవసరాలకు సరిపడేలా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా కొనసాగుతామనీ మరొక్కసారి మాటిస్తున్నాం.

ప్రతి నెల దర్పణం ద్వారా మీతో ముచ్చటిస్తాము. మీ సలహాలు పాటిస్తాము. ప్రతి నెల దర్పణం మీ ముంగిటిలో ఉండేలా ప్రయత్నిస్తాము. మిగతా విషయాలు సందర్భానుసారంగా మీతో పంచుకుంటూనే ఉంటాము కానీ, మీరు మీ రచనల్ని, మీ

విజయాల్ని, మీ జ్ఞాపకాల్ని మాకు రాసిపంపండి. పరిశీలించి, ప్రచురణయోగ్యమైతే దర్పణంలో ప్రచురిస్తాం. మీ సృజనాత్మకతకు వేదికగా నిలబడతాం.

మా కార్యవర్గం కార్యనిర్వహణ బాధ్యతల్ని స్వీకరించిన తర్వాత వెలువడుతున్న మొదటి దర్పణం ఇది. అందుకే ఈ మొదటి సంచికలోనే రకరకాల హామీలను, అమితమైన వాగ్దానాలను మీ ముందు పెట్టి మీలో సందేహాలు మొలకెత్తించే అవకాశం ఇవ్వదలుచుకోలేదు. ఎక్కువ చెప్పకుండా మా హయాంలో ఎక్కువ చేసి చూపించాలన్నదే మా తాపత్రయం. తక్కువ చెప్పి ఎక్కువ చేయడమే యోగ్యతకు సరైన నిర్వచనమని మేం నమ్ముతున్నాం.

అధికారంలో ఉన్నవారిదే ఆంధ్ర మహాసభ అని అనుకోవద్దు. మాకు సరైన మార్గనిర్దేశం చేసేందుకు మీరు సర్వదా సిద్ధంగా ఉండాలి. ఈ మహాసభ మనందరిది. పరిమిత కాల వ్యవధి కోసం మాత్రమే మేం అధికారంలో ఉంటాం. కానీ, ఆంధ్ర మహాసభ మన తెలుగువారి శాశ్వత వారసత్వ సంపద. దీన్ని భద్రంగా కాపాడుకుందాం.

రండి..! మహాసభ మట్టికి ప్రణమిల్లుతూ, సరికొత్త అధ్యాయాన్ని మొదలెడదాం..! మహాసభ కీర్తి కిరీటంలో స్వర్ణాక్షర చరితను పొందికగా పొదుగుదాం..! మీ అందరికిదే స్వాగతం..!!

ధన్యవాదములతో..

**సంకు సుధాకర్**
**అధ్యక్షుడు**

**తాళ్ళ నరేశ్**
**ప్రధాన కార్యదర్శి**

## సభ్యులకు కొన్ని సూచనలు

- మీ చిరునామాగానీ, ఫోన్ నంబర్‌గానీ మారితే మాకు వెంటనే రాసి పంపండి.
- దర్పణంలో ప్రచురణార్థం కవితలు, జోక్స్, వింతలు, విశేషాలు, చిన్న చిన్న కథలు, వ్యాసాలు, విశ్లేషణలు, సమీక్షలు రాసి పంపండి. ప్రచురణకు అర్హమైన వాటిని అవసరం వస్తే తగిన మార్పులు చేసి ప్రచురిస్తాం.
- సభ్యులు ఏదైనా సామాజిక, సాంస్కృతిక, సాహితీ, క్రీడా, విద్యలాంటి రంగాల్లో ఏవైనా అవార్డులు, రివార్డులు పొందినట్లయితే మాకు తెలియరాయండి. వీలైతే అందుకు సంబంధించిన ఫోటో కూడా పంపండి. ప్రచురిస్తాం.
- రచనలు తమ స్వంతమనీ హామీ పత్రం జతచేయండి.
- ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయం. వాదోపవాదాలకు తావులేదు.
- సభ్యులకు చెందిన పెళ్ళిరోజులు, పుట్టిన రోజుల గురించి ముందస్తుగా మాకు తెలియచేస్తే ఉచితంగా ప్రచురిస్తాం.
- సభ్యుల కుటుంబాలకు చెందిన సంతాప వార్తలు కూడా ప్రచురిస్తాం.
- న్యాయసంబంధిత వాదాపవాదాలన్నీ ముంబై న్యాయాలయాల వరకే పరిమితం.

**ఈ దర్పణం పత్రిక ఆంధ్రమహాసభ సభ్యుల మనోదర్పణానికి దర్పణం కావాలన్నదే మా ఆకాంక్ష, ఆశయం.**

## తెలుగువారి అభిమాన ఆంధ్ర మహాసభలో అన్ని హంగులు ఉండాలి.

అందుకే.... రానున్న రోజుల్లో ఆంధ్రమహాసభకు పలు కారణాల వల్ల వచ్చే అతిథి దేవుళ్ళ కోసం ఒక అందమైన 'టెర్రస్ కెఫెటేరియా' కూడా ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ప్రస్తుతం ఆంధ్రమహాసభలో, విచ్చేసే అతిథులకు, జీవిత సభ్యులకు కనీసం కాసేపు కూర్చొని, టీ, కాఫీ తాగేందుకు కూడా సరైన చోటు లేదనే చెప్పాలి. ఎలాంటి అడ్డంకులు ఎదురుకాకుంటే రానున్న కొద్ది కాలంలోనే ఒక చక్కని కాలక్షేపానికి కేఫేటేరియా ఏర్పాటు అయ్యే అవకాశాలున్నాయని చెప్పేందుకు సంతోషిస్తున్నాం.

అలాగే మహాసభ బేస్‌మెంట్‌లో గతంలో ఒక జింఖానా ఉండేది. జింఖానాలో కూడా అత్యాధునిక పరికరాలతో ఒక చక్కటి వ్యాయామశాల ఏర్పాటు చేయాలనే అభిప్రాయం కూడా ఉంది. మహాసభ పాలక వర్గాలన్నింటి సహాయ సహకారాలతో, సహమతితో ఈ రెండు లక్ష్యాలు నెరవేర్చేందుకు తప్పకుండా కృషి చేస్తాం.

**ధన్యవాదములతో...**




# ప్రశాంతంగా ముగిసిన ఆంధ్ర మహాసభ ఎన్నికలు

**మ**హారాష్ట్రలోని తెలుగువారందరికీ స్వాభిమాన ప్రతీకగా, తెలుగుతనానికి ప్రతిరూపమై, తొమ్మిది దశాబ్దాలుగా తెలుగువారి కీర్తిపతాకను విశ్వవ్యాప్తం చేస్తున్న **'ది బొంబాయి ఆంధ్రమహాసభ అండ్ జింఖానా'** లో గత కొన్ని నెలలలో మహత్వపూరితమైన సంఘటనలు జరిగాయి. ఈ సంఘటనలు సభికుల్లో కాస్త కలవరం, మరికాస్త సంచలనం కలిగించినప్పటికీ, చివరకు శుభం కార్డు పడడం వల్ల ఆ సంఘటనలేవీ అంతగా బాధించడం లేదు.

ముందుగా, కార్యవర్గం నిష్క్రియాత్మకంగా మారిందనే భావనతో ధర్మకర్తల మండలి వారు కార్యవర్గాన్ని సూపర్‌సీడ్ చేయడంతో మొదట్లో జీవిత సభ్యులు కాస్త కలత చెందారు. మహాసభ చరిత్రలో ఒక కార్యవర్గం రద్దు కావడం ఇది రెండవసారి కావడంతో భవిష్యత్తు ఎలా వుంటుందోననీ బెంగపడ్డారు.

కానీ, ధర్మకర్తలు పూనుకొని సకాలంలో ఎన్నికలు నిర్వహించడం, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సుసంపన్నం చేయడంతో వారు మళ్ళీ సంతృప్తిగా ఊపిరిపీల్చుకున్నారు. కొత్త కార్యవర్గం అధికారాన్ని అధిరోహించడంతో ఆనందపడ్డారు. కొత్త కొత్త కార్యక్రమాలతో ఆంధ్రమహాసభ మళ్ళీ కళకళలాడుతుందని ఆశపడుతున్నారు.

'రద్దు' నుండి నూతన కార్యవర్గం ఏర్పడే వరకు జరిగిన కథా కమామీషు ఏమిటంటే...!

ధర్మకర్తల మండలి చైర్మెన్ సంగం ఏక్‌నాథ్, కార్యదర్శి రాపెల్లి పరమేశ్వర్ అధ్వర్యంలోని ధర్మకర్తల మండలి ఎన్నో ప్రయాసలు ఒనర్చి, ప్రయత్నాలు చేసి కూడా కార్యవర్గంలో ఏర్పడ్డ విభేదాలను పరిష్కరించలేకపోవడంతో, **'తప్పని పరిస్థితుల్లో కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నామనీ, త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామనీ..'** ధర్మకర్తలు ప్రకటించారు.

తత్ఫలితంగా తేది 22.07.2018 నాడు ఎన్నికలు నిర్వహిస్తామనీ నోటిఫికేషన్ వెలువరించారు.

ఈ ఎన్నికల నిర్వహణకు మహాసభ జీవిత సభ్యుడైన **బోగా సదానంద్‌ను** ఎన్నికల అధికారిగా నియమించడంతో ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. 19 ఆగస్ట్, 2018 నాడు ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. దాంతో పాటే ఆంధ్ర మహాసభ జీవిత సభ్యుల్లో ఎన్నికల కదలికలు మొదలయ్యాయి.

నలుగురు ధర్మకర్తలు, ఒక అధ్యక్షుడు, ఒక ప్రధాన కార్యదర్శి, ముగ్గురు ఉపాధ్యక్షులు, ఒక కోశాధికారి, ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యుల ఎంపిక కోసం నోటిఫికేషన్ జారీ చేశారు.

మహాసభ రాజ్యాంగంలో ప్యానెల్ పద్ధతి లేకపోయినప్పటికీ, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు, సంఘటితంగా ఒక ప్యానెల్‌గా ఏర్పడి ఎన్నికల్లో పాల్గొనడం ఒక రివాజుగా వస్తోంది. అదే సాంప్రదాయం ప్రకారం ఈ సారి కూడా రెండు ప్యానెల్స్ బరిలోకి దిగాయి. ఈ రెండు ప్యానెల్స్‌తో పాటు మరికొందరు అభ్యర్థులు ఒక స్వతంత్ర్య కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో నిలిచారు. కాకపోతే ఈ స్వతంత్ర్య కూటమి అభ్యర్థులంతా కేవలం కార్యవర్గ సభ్యుల కోసం మాత్రమే పోటీ చేశారు.

ఆంధ్ర మహాసభ జీవిత సభ్యులు ముంబయి, నవీముంబయి, ఉపనగరాలతో పాటు భీవండిలో కూడా ఉన్నారు. కానీ, ఎన్నికలు ప్రకటించిన రోజు నుండి ఎన్నికలు ముగిసేవరకు వర్లీ, లోవర్ పరేల్, ఖేడ్‌గల్లీ ప్రాంతంలో ఎక్కువగా సందడి కనిపించింది. ముందుగా ప్యానెల్స్ నిర్మాణంలో అభ్యర్థులు తలమునకలయ్యారు. అభ్యర్థుల ఎంపికలో ఎన్నో ఉద్వేగ, ఉత్తేజ క్షణాలను ఎదుర్కొన్నారు. బుజ్జగింపులు, అనునయ అభ్యర్థనలు, సరిదిద్దుకోవటాలు, పరిపక్వత, ప్రావీణ్యత, ప్రాంతీయత తదితర అంశాల సమన్వయం కోసం రకరకాల సమావేశాలు వగైరా జరుపుకున్న తర్వాత ప్యానెల్స్ తుదిరూపాన్ని సంతరించుకున్నాయి.

మాజీ అధ్యక్షుడు సంకు సుధాకర్ మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న ప్యానెల్‌లో ధర్మకర్తల అభ్యర్థులుగా పోతు రాజారాం, రాపెల్లి పరమేశ్వర్, శెకెల్లి రాములు, పిట్ల బాలక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి అభ్యర్థిగా తాళ్ళ నరేశ్, పరిపాలనా శాఖ ఉపాధ్యక్షులుగా బడుగు విశ్వనాథ్, సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్ష అభ్యర్థిగా డా॥రాధా మోహన్, సాహిత్య, క్రీడా విభాగ ఉపాధ్యక్ష అభ్యర్థిగా గాలి మురళీధర్, కోశాధికారి అభ్యర్థిగా బింగి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి అభ్యర్థులుగా చిల్వేరి గోవర్ధన్, నాగెళ్ళ దేవానంద్, కార్యవర్గ అభ్యర్థులుగా అడ్డగట్ల మురళి. అడ్డగట్ల శ్రీనివాస్, అల్లె శంకరయ్య, కళ్యాణపు రవీందర్, రాంపెల్లి జ్ఞానేశ్వర్, సాదుల రమేశ్, సురుకుట్ల సురేశ్, తలకొక్కుల గంగాధర్, తాటికొండ మోతీరాం పోటీలో నిలిచారు.

మరోవైపు గత కార్యవర్గంలో పరిపాలనా శాఖ ఉపాధ్యక్షులుగా విధులు నిర్వహించిన ద్యావరిశెట్టి గంగాధర్ అధ్యక్షుడిగా బరిలో నిలిచారు. ద్యావరిశెట్టి గంగాధర్ ప్యానెల్‌లో ధర్మకర్తలుగా మంతెన రమేశ్, గుండేటి గంగారాజం, నీల నాగేశ్వర్, దంతాల పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా వేముల మనోహర్, పరిపాలనా శాఖ ఉపాధ్యక్షులుగా యెలిగేటి రాజ్‌కుమార్, సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షులుగా గట్టు నర్సయ్య, సాహిత్య, క్రీడా విభాగ ఉపాధ్యక్ష అభ్యర్థిగా నడిమెట్ల యెల్లప్ప, కోశాధికారిగా గుజ్జేటి కృపేందర్, సంయుక్త కార్యదర్శి అభ్యర్థులుగా బొమ్మకంటి కైలాశ్, గాజెంగి వెంకటేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా గంజి గోవర్ధన్, జిందం భాస్కర్, కొండా వెంకటనారాయణరెడ్డి, కూచన్ బాలకృష్ణ, మహేశ్వరం చంద్రశేఖర్, నక్క మనోహర్, పిచిక రత్నమాల, సిరిపురం రాజేశం, వేముల రాంచందర్ తుది జాబితాలో స్థానం దక్కించుకున్నారు.

స్వతంత్ర్య కూటమి తరపున కార్యవర్గ సభ్యులుగా గోగుర్ల నిరంజన్, గుడ్ల నరేశ్, శేర్ల ప్రహ్లాద్, సంజయ్ యెగుర్వార్ కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.

అయితే, సంకు సుధాకర్ ప్యానెల్ తరపున సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శిగా పోటీ చేయాలనుకున్న మచ్చ సుజాతకు వ్యతిరేకంగా ద్యావరిశెట్టి గంగాధర్ ప్యానెల్ వారు తమ అభ్యర్థిని బరిలోకి దించకపోవడం వల్ల మచ్చ సుజాత ఏకగ్రీవంగా సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శిగా ఎంపిక కావడం విశేషం.

## జోరుగా సాగిన ప్రచారపర్వం:-

గత కొన్నేండ్లుగా ఆంధ్ర మహాసభ కార్యవర్గ ఎన్నికల పట్ల జీవిత సభ్యుల్లో విపరీతమైన ఆసక్తి పెరిగిపోయిందనడానికి గతంలో జరిగిన ఎన్నికలే ప్రత్యక్ష ఉదాహరణ. అదే పరంపరలో ఈసారి కూడా ఎన్నికల్లో అదే ఉత్సాహం కనిపించింది. ఎక్కువ మంది జీవిత సభ్యులు వర్లీ, ఖేడ్‌గల్లీ ప్రాంతంలో ఉండడం వల్ల అభ్యర్థుల జోరంతా ఈ ప్రాంతాల చుట్టే కొనసాగింది. జీవిత సభ్యుల చిరునామాలు, ఫోన్ నంబర్ల జాబితాలు చేతపట్టుకొని అభ్యర్థులు సమూహం, సమూహాలుగా ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించుకున్నారు. ఉదయం నుండి నడి రేయి వరకు ప్రచారాలు జోరుగా సాగాయి.

వర్లీ, ఖేడ్‌గల్లీ, లోవర్ పరేల్ తదితర తెలుగు బహుళ ప్రాంతాలు బ్యానర్లు, పోస్టర్ల్ తో కళకళలాడాయి. ఏ ఇద్దరు తెలుగువారు కలిసినా ఆంధ్రమహాసభ ఎన్నికల గురించే చర్చించుకొని ఎన్నికల సమరోత్సాహానికి మరింత రంగులద్దారు. రెండు ప్యానల్స్‌కు చెందిన నిర్వాహకులు, అభ్యర్థులు రంగు రంగుల బుక్‌లెట్‌లను ముద్రించి జీవిత సభ్యులందరికీ అందేలా ప్రయత్నించారు. ఆ బుక్‌లెట్స్‌లో అభ్యర్థుల పరిచయాలు, ముందస్తు ప్రణాలికలు తదితర అంశాలను వివరంగా పొందు పరిచారు. జీవిత సభ్యుల్ని ఆకర్షించేందుకు అభ్యర్థులు చేసిన ప్రయత్నాలు శాసన సభ ఎన్నికల తీరుని తలపింపచేశాయి.

సంకు సుధాకర్ ప్యానెల్ అనుయాయులు ఆదర్శనగర్‌లోని వర్లీ స్పోర్ట్స్ క్లబ్‌లో, బిడిడి చాల్స్‌లోని 104-105 మధ్య గల ఖాళీ స్థలంలో బహిరంగ సభలు నిర్వహించారు. అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న సంకు సుధాకర్ మాట్లాడుతూ, 'ఎన్నికైన తర్వాత జీవిత సభ్యుల ఆకాంక్షల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తామనీ, ఆంధ్ర మహాసభ కీర్తి కిరీటంలో మణిపూసలాంటి స్వర్ణ అధ్యాయాల్ని లిఖిస్తామనీ, వివాదాలకు అతీతంగా అందరినీ కలుపుకుపోతామనీ, ప్రతి నెలా దర్పణం పత్రిక తీసుకువస్తామనీ..' హామీ ఇచ్చారు. ట్రస్టీ అభ్యర్థి పోతు రాజారాం మాట్లాడుతూ, 'లీజు వ్యవహారం, హాలు పునర్నిర్మాణం, లిఫ్ట్ తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తామనీ..' అన్నారు.

మరోవైపు రెండవ ప్యానెల్‌కు చెందిన అధ్యక్ష అభ్యర్థి ద్యావరిశెట్టి గంగాధర్ కూడా తమ మానిఫెస్టోలో ఇంచుమించు ఇవే విషయాల్ని ప్రస్తావించారు. అభ్యర్థులంతా ఎక్కడ ప్రచారం నిర్వహించినా ఆంధ్ర మహాసభకు మంచి రోజులు తీసుకు వస్తామనే అంశం మీదే ఓట్లు అడగడం గమనార్హం. నుక్కడ్ సమావేశాలు ఎన్ని జరిగాయో వాటికి లెక్కే లేదు..!!

స్వతంత్ర్య కూటమికి చెందిన అభ్యర్థులు కూడా జోరుగా ప్రచారం చేసుకోవడం ఆశ్చర్యం కలిగించింది.

## ఎన్నికలు:

ఎన్నికల రోజు రానే వచ్చింది. అదే రోజు అంటే 19 ఆగస్ట్, 2018 నాడు ఉదయం 10.00 గంటలకు ధర్మకర్తల మండలి అధ్వర్యంలో ఆంధ్ర మహాసభ సర్వసభ్య సమావేశం కూడా జరిగింది. ఒకవైపు సర్వసభ్య సమావేశం, మరోవైపు ఎన్నికల కోలాహలంతో ఆంధ్ర మహాసభ పరిసరాలన్నీ జనంతో నిండిపోయాయి.

## ఆయుధం

సాహితీ దర్పణం

- ఆనందభారతి
098927 74021

నీతి నా ఆయుధం
నిజాయితీ నా కవచం
భీతి... భయం
నా దరి చేరవు
జయాప జయాలు
నన్నాప లేవు
నిన్నటిని నెమరేసుకోను
రేపటికేమి జమచేసుకోను.
ఆకాశమే నాహద్దు
ఏ అవకాశమైనా నాకు ముద్దు
అను నిత్యము
అదే నా ఆరాటము
ఎందుకో..?? నా కలము
ఆపకంటుందీ పోరాటము

❀❀❀

## నా ఆలోచన

సాహితీ దర్పణం

- కీసరి నర్సయ్య
000000 00000

నిన్నటి సూర్యుడు మళ్ళీ వచ్చాడు
నిన్ను, నన్ను, ఈ లోకాన్ని
నిద్రలేపడానికి...!
నిరంతరం మనందరిని నిద్ర లేపడం
లోకానికి వెలుగు పంచడం
అలుపెరగని తను చేస్తూనే ఉన్నాడు...!
ఆ వెలుగులో మనం ఎన్నో చేయాలి,
మరెన్నో చేయాలి, మరెన్నో సాధించాలి
రేపటి కోసం ఆలోచన వదిలేయి...!
ఎందుకంటే నీకోసం
రేపు అనే రోజు నీకై ఎదురుచూస్తుంది..
నీవు వద్దన్నా నిన్ను వదలదు
కావాలన్నా ఎదురుపడి రాదు...!
అందుకే..!
ఈ రోజు ఏమిచెయ్యాలో చేసేయ్..!!

❀❀❀






ఎన్నికల అధికారి బోగా సదానంద్ మహాసభ ప్రాంగణంలో ప్రచారాన్ని నిషేదించడం వల్ల, అభ్యర్థులంతా గేటు బయటే నిలబడి వచ్చిపోయే జీవిత సభ్యుల్ని ఆపి ఓటు అడిగారు. రోజంతా, అప్పుడప్పుడు కురుస్తున్న వర్షంలో తడుస్తూ అభ్యర్థులు ఓట్ల కోసం నానా పాట్లు పడ్డారు. గత కొంత కాలంగా ఆంధ్ర మహాసభలో జరిగిన సంఘటనల వల్ల ఎన్నికల రోజు ఉద్రిక్తమైన పరిస్థితులు ఏర్పడుతాయేమోననే సందేహంతో ధర్మకర్తలు చాలా చక్కటి బందోబస్తు నిర్వహించారు. నిర్ణీత సమయం ప్రకారం ఎంతో ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో ఎన్నికల అధికారి బోగా సదానంద్‌తో పాటు ఆయన సిబ్బంది కూడా ఊపిరి పీల్చుకున్నారు.

**ఓట్ల లెక్కింపు:**

15 రోజులుగా ఎంతో ఒత్తిడితో ఎన్నికల ప్రచారంలో పాల్గొని అలిసిపోయిన అభ్యర్థులంతా ఎన్నికల సమయం ముగియగానే కాస్త సేదతీరారు. కానీ, అదే రాత్రి ప్రకటించబోయే ఫలితాల గురించి మరో కొత్త టెన్షన్‌ను అనుభవించారు. ఓట్ల లెక్కింపు కూడా పక్కా ప్రణాళికతో కొనసాగింది. గతంలో లాగా ఒక్కో రౌండ్ ఫలితాలు వెంటది వెంట ప్రకటించకుండా ఎన్నికల సంఘం కొత్త తరహా ఏర్పాట్లు చేశారు. రాత్రి దాదాపు 11 గంటల ప్రాంతంలో మొత్తం ఫలితాలు ఒకేసారి వెలువడడంతో పోటీ చేసిన అభ్యర్థుల్లో కొందరు ఆనందానికి గురైతే, మరికొందరు ఆవేదనకు గురయ్యారు.

**ఫలితాలు:**

ఊపిరి ఆగిపోయే ఉత్కంఠ మధ్య ఎన్నికల ఫలితాలు వెలువరించారు. ఎన్నికల అధికారి తన సహచరులతో కలిసి సభాప్రాంగణంలోని వేదిక మీదికి చేరుకున్నారు. ఆయన ఒక్కో ఫలితాన్ని ప్రకటిస్తున్న కొద్దీ అక్కడే అభ్యర్థులతో పాటు భారీ సంఖ్యలో గుమిగూడిన అభిమానుల్లో కొందరు సంతోషం పట్టలేక కేరింతలు కొడుతుంటే మరికొందరు మౌనంగా నిష్క్రమించారు. ఏ ఎన్నికల్లో అయినా అంతే గదా..! కభీ ఖుషీ .. కభీ గమ్..!

ఎన్నికల అధికారి బోగా సదానంద్ అధికారికంగా ప్రకటించిన ఫలితాలు ఇలా వున్నాయి.

**ధర్మకర్తలుగా...**

**పోతు రాజారాం**

**మంతెన రమేశ్**

**రాపెల్లి పరమేశ్వర్**

**శెకెల్లి రాములు**

**కార్యవర్గం...**

అధ్యక్షుడిగా – **సంకు సుధాకర్,**

ప్రధాన కార్యదర్శిగా – **తాళ్ళ నరేశ్**

పరిపాలన శాఖ ఉపాధ్యక్షుడిగా – **బడుగు విశ్వనాథ్**

సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షుడిగా – **డా|| రాధా మోహన్**

సాహిత్య, క్రీడా విభాగ ఉపాధ్యక్షుడిగా – **నడిమెట్ల యెల్లప్ప**

కోశాధికారిగా – **బింగి సత్యనారాయణ**









పరిపాలన శాఖ సంయుక్త కార్యదర్శిగా – **బొమ్మకంటి కైలాశ్**

సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శిగా – **మచ్చ సుజాత** (ఏకగ్రీవం),

సాహిత్య, క్రీడా విభాగ సంయుక్త కార్యదర్శిగా – **గాజెంగి వెంకటేశ్వర్**

**కార్యవర్గ సభ్యులుగా...**

**పిచిక రత్నమాల**
**సురుకుట్ల సురేశ్**
**వేముల రాంచంద్రం**
**రాంపల్లి జ్ఞానేశ్వర్**
**తాటికొండ మోతీరాం**
**అడ్డగట్ల శ్రీనివాస్**
**సాదుల రమేశ్**
**అల్లె శంకరయ్య**
**శేర్ల ప్రహ్లాద్**

ఎన్నికల ఫలితాలు వెలువరించిన తరువాత, ఎన్నికల అధికారి బోగా సదానంద్ విజేతలందరినీ వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, **'ఆంధ్ర మహాసభ వివాదాల వల్ల చర్చలో ఉండి రకరకాల పరిస్థితులకు గురైన నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో గెలుపొందిన వారంతా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారనీ, ఆంధ్ర మహాసభ గౌరవాన్ని కాపాడుతారనే..'** ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సంకు సుధాకర్ మాట్లాడుతూ, **'గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటామనీ, జరిగిన పొరపాట్లు మళ్ళీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు వహిస్తామనీ, ఎన్నికల్లో పోటీ చేసిన వారందరు పోరాట యోధులేననీ, గెలుపు ఓటములకు అతీతంగా అందరినీ కలుపుకొని ముందుకు నడుస్తామనీ..'** సభా ముఖంగా హామీ ఇచ్చారు.

గెలుపొందిన వారి సంతోష కేరింతల మధ్య ఆ రోజు తెల్లారింది.

## ఎన్నీల ముచ్చట్లు

– వజ్రనాభ్ నటరాజ్ మహర్షి
**095949 96122**

ఇంకా ముచ్చట్లేనా ? అసూయా ద్వేషాల అగచాట్లేనా ?
నిల్లు కారక్టర్తో సొల్లు కబుర్లే ఎన్నీల ముచ్చాట్లా ?
కులం కంపు.. నా భాష ఇంపును,
గుబాళింపును చంపేస్తుందేవిటో ?
భాషను బ్రతికించుకుందామంటారు
రాత్రి కాగానే రంగీన్ నిషాలో శూరత్వాన్ని చూపిస్తారు !
కిస్కి జాగీర్ హై మేర భాషా ?
ఆత్మశుద్ధి చేసుకోలేని పిరికి వీరుల కబడ్డి కోర్టిది !
మంచి పని చేద్దామనుకొనేవాడ్ని పాతాళానికి
తోసేయాలనుకొనే పనికి మాలిన
జెంటిల్ కవుల రాజ్యమిది !
ఎక్ దిన్ కా సుల్తాన్ గాల్ల అడ్డా ఇది!
నోట్లో ఫినాయిల్ పోసుకొని
నాఫ్తాలిన్ భాష మాట్లాడే పగటి వేషగాళ్ళ ఠాణా ఇది !
సత్కవులపై కళాపిపాసకులపై
2 టన్నుల బురద జల్లే ట్విన్ టంగ్ ల గారడీ వాడ్ని !
కవిత అర్థం కాకాపోయినాచప్పట్లు కొడుతూ
32 పళ్లతో మంకి డాన్స్ చేయించే నిస్సిగ్గు కవిని !
భాష ఏమయిపోతే నాకేంటి ?
కలం విరిగిపోతే నాకేంటి కాలం కరిగిపోతే నాకేంటి ?
హైడ్రోసల్ఫ్యూరిక్ యాసిడ్తో కడిగినా కూడా,
ఏమీ కాని ఎప్పుడో చచ్చిపోయిన తెలుగు కవిని !
నేనేంటో నాకే తెలియని వికట కవిని... !!!




**ప్రమాణ స్వీకారం:**

ఎన్నికల్లో గెలుపొందిన వారందరు తేది 01.09.2018. నాడు సాయంత్రం 6.30 గంటలకు ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో పదవీ బాధ్యతల ప్రమాణ స్వీకారం చేశారు.

తొలుత ఈటీవిలో ప్రసారమవుతున్న జబర్దస్త్ కార్యక్ర మానికి చెందిన కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి ంచారు. నూతన సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షురాలు డా॥ రాధా మోహన్ అధ్వర్యంలో జరిగిన ఆ కార్యక్రమం సభికుల్ని ఎంతో అకట్టు కుంది. ఆ తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.

నూతన అధ్యక్షుడు సంకు సుధాకర్ కొత్తగా ఎంపికైన ధర్మకర్తలు, పదాధికారులు, కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రతిష్టాత్మకమైన ఆంధ్ర మహాసభ నిర్వాహణ కోసం కొత్త ప్రతినిధులు సన్నిద్ధమయ్యారు. జీవిత సభ్యులంతా వారి వైపు ఎంతో ఆశావహదృక్కులతో చూస్తున్నారు. ఆంధ్ర మహాసభకు మంచి రోజులు రావాలని కోరుకుంటున్నారు.

సంకు సుధాకర్ నాయకత్వంలోని సరికొత్త కార్యవర్గానకి హార్ధిక శుభాకాంక్షలు.





## ఎన్నికల నిర్వాహణ బాధ్యులు...!



## ఆంధ్రమహాసభలో జరిగిన కార్యక్రమాల వివరాలు

### తేది 07.09.2018 శుక్రవారము ఉదయం 10 గం॥ మహిళాశాఖ వారి వరలక్ష్మి వ్రతము



మహిళశాఖ ఆధ్వర్యమున తేదీ 07.09.2018 శుక్రవారము ఉదయం 10.00 గంటలకు శ్రావణమాసం పురస్కరించుకొని శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా మహిళశాఖ వారు నిర్వహించారు. శాస్త్రయుక్తంగ శ్రీ తాడూరి మోహన్ పూజారి గారు పూజ జరిపించారు. అట్టి కార్యక్రమమునకు మహిళలు దూర ప్రాంతముల నుండి వచ్చి సామూహికంగా పూజలో పాల్గొని ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అ కార్యక్రమంలో అధ్యక్షురాలు శ్రీమతి యత్తం లతగారు అందరికీ స్వాగతం పలికారు. అ కార్యక్రమానికి వచ్చిన మహిళలు కార్యక్రమమును విజయవంతం చేసారు. పూజ అనంతరం సామూహికంగా లలితా సహస్రనామం చదివి అందరిని అలరింప జేసారు. వచ్చిన వారందరికి మహాప్రసాదము, ఆత్మీయ భోజనము ఏర్పాటు చేయనైనది. అందరికి చందన తాంబులాలు ఇచ్చి సత్కరించారు. అ కార్యక్రమములో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వరలక్ష్మి అమ్మవారి ఆశీర్వాదము పొంది విజయవంతము చేసినందుకు మహిళశాఖ వారు కృతజ్ఞతలు తెలిపారు.

అ కార్యక్రమములో అధ్యక్షురాలు యత్తం లత, కార్యదర్శి సోమల్ లత, ఉపాధ్యక్షురాలు టి. అపరజిత, సంయక్త కార్యదర్శి ఇ. విజయలక్ష్మీ, సభ్యులు సంగెవేని విజయ, కస్తూరి సుజాత, పిల్లమరపు పద్మ, టి. కరుణశ్రీ, మేఘమాల తదితరులు పాల్గొన్నారు. ఆ కార్యక్రమానికి ముంబయి మాజి మేయర్ శ్రీమతి స్నేహల్ అంబేకర్ గారు గౌరవ అథితిగా హాజరయ్యారు.

### తేది 12.10.2018 శుక్రవారము ఉదయం 10 గం॥ మహిళాశాఖ వారి దసరా సంబరాలు



మహిళశాఖ ఆధ్వర్యమున తేదీ 12.10.2018 శుక్రవారము ఉదయం 10.00 గంటలకు దసరా నవరాత్రులు పురస్కరించుకొని బతుకమ్మ సంబురాలు,బొమ్మల కొలువు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన కుమారి మీనా, శిష్య బృందం ప్రదర్శించిన మహిసాసుర మర్ధిని ఆహుతులను మంత్రముగ్దుల్ని చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కార్పొరేటర్ కృష్ణవేణిరెడ్డి, రాధామోహన్ వచ్చారు.

అ కార్యక్రమములో అధ్యక్షురాలు యత్తం లత, కార్యదర్శి సోమల్ లత, ఉపాధ్యక్షురాలు టి. అపరజిత, సభ్యులు ఇ. విజయలక్ష్మి, సంగెవేని విజయ, కస్తూరి సుజాత, పిల్లమరపు పద్మ, టి. కరుణశ్రీ, ధమయంతిదేవి తదితరులు పాల్గొన్నారు. వచ్చిన మహిళలందరికి బొద్దుపల్లి కమల కుమారి జ్ఞాపకార్ధం పసుపు–కుంకుమ కానుకలు అందజేశారు.

# కన్నీటి కేరళ....




- దేవానంద్ నాగెల్ల
09820277219

నేను కేరళ
అవును నేను మీ కేరళ
ప్రకృతి అందాలతో
గలగల సేలయేర్లతో....
అను నిత్యం ప్రకృతి ప్రేమికులకు
చక్కని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని
అందించిన భూతల స్వర్గమైన మీ కేరళ నేను.

ఒక మంచి సాంప్రదాయాన్ని
సంస్కృతిని కళలను అందించి
దేశవిదేశాల్లో పేరెన్నికగన్న
సుందర ప్రాంతంగా గుర్తించబడిన... మీ కేరళని.. !!

నా రూపు రేఖలు.... నేడు చెరిపివేయబడ్డాయి.
విధి వంచించిందో....
నా తల రాత వక్రీకరించిందో.... !!
నేను చేయని నేరానికి శిక్ష అన్నట్లుగా...
వందల సంవత్సరాల నా అందమైన చరిత్ర....
గంగలో కలిసిపోయింది.

పద్మనాభుని వీర ప్రతాపమో...
అయ్యప్ప స్వామి అలకనో....
పంబా నది పవిత్రతకు భంగం కలిగిందో...!!
తెలియదు కానీ...!!
యాభై ఆరు మహానదుల వరద
ఒక్కసారిగా దిక్కులు పిక్కటిల్లేలా గర్జిస్తూ....
నన్ను దిక్కులేని దాన్ని చేసాయి.

విధి వంచితను నేను
మదిలో రగిలే వేదనలతో.... నాకు నేనే కృంగిపోతున్నా

ఏవీ నిన్నటి కొబ్బరి తోటల సోయగాలు...
ఏవీ సేలయేరుల గలగలలు
ఏవీ వన్యప్రాణుల సయ్యాటలు
ఏవీ ఖడ్గ మృగాల గాండ్రింపులు
రంగురంగుల కాంతులు విరజిమ్ముతూ నడయాడిన..
ఆ రంగుల రాట్నాలు
లాంచీలు పడవలు... బోటులో షికారులు... !!
ఏరీ... ఆ చెలికాండ్లూ ... !! అంతా... కకావికలం

అదిగో... కాలుతున్న ఆ శవాల కమురు వాసన
అదిగో ముక్కుతూ మూలుగుతూ ఎందుకు
బ్రతికామురా దేవుడా....
అంటూ దీనంగా రోదిస్తు ... ఆ రోదనలు
భర్తలను పోగొట్టుకున్న స్త్రీలు
తల్లి తండ్రులను పోగొట్టుకున్న ఆ చిన్నారులు
కన్న బిడ్డలను దూరం చేసుకున్న ఆ దౌర్భాగ్యపు తల్లి
తండ్రులు.....
ఒక భార్య, ఒక భర్త....., ఒక ప్రేయసి
ఒక ప్రియుడు.... ఎవరు ఎవర్నీ పోగొట్టుకొని
ఏడుస్తున్నారో.... ఇంకా పూర్తిగా లేక్కతేలని
ఒక దిక్కులేని.... కేరళని... !! నేను

ఏదీ ఏమైనా నా అందం తిరిగి నాకు కావాలి....
నా నుదుట పాపిటవలే కనపడి తెగిపోయిన
రహదారులు,
కూలిపోయిన బ్రిడ్జీలు నిర్మించవలె
పాడైపోయిన నా పట్టణాలు
సోయగాలు వెలగబెట్టిన పల్లెసీమలు తిరిగి
కలకలలాడవలె....
అందుకే..... నా ఈ కన్నీటి రోదన

భేషజాలు పక్కన పెట్టి మానవత్వం గల మనుషుల్లా
స్పందించి తిరిగి నిర్మించండి భూతల స్వర్గమైన కేరళ
....
నేను కాకూడదు కన్నీటి కేరళ

# మీ సేవలో... మహాసభ




**ఆం**ధ్రమహాసభ అంటే కేవలం
వినోద కార్యక్రమాల కేంద్రం మాత్రమే కాదు...
ప్రతి మనిషి జీవితాన్ని చైతన్యపరిచే
విజ్ఞాన భాండారం కూడా...!!

## ఆధ్యాత్మిక వెలుగుల కోసం



**మ**నిషికి మానసిక ప్రశాంతతని కలిగించేందుకు దోహదపడేవి ఆధ్యాత్మిక కేంద్రాలే. మహాసభ ప్రాంగణంలోనే శ్రీవేంకటేశ్వర మందిరం ఉంది. నిత్యపూజలు జరుగుతుంటాయి. నిశ్శబ్దంగా ధ్యానం చేసుకునేందుకు ప్రత్యేక హాలు కూడా ఉంది. మీరెప్పుడైనా వచ్చి ఆ దేవదేవుణ్ణి దర్శించుకోవచ్చు. మొక్కులు తీర్చుకోవచ్చు. మోక్షమార్గంలో తరించవచ్చు...

**మహాసభ... మనందరి సభ... రండి...! కార్యక్రమాలు నిర్వహిద్దాం... విజయవంతం చేద్దాం...!!**

## మీ విజ్ఞానం కోసం



**పు**స్తకం హస్త భూషణం అన్నారు కదా..! అంతేకాదు... పుస్తకాలు మస్తిష్కాలని వెలిగించే దీపాలు కూడా...! పుస్తకాలు లేని ఇల్లు స్మశానంతో సమానమని ఓ సామెత కూడా ఉంది. పుస్తకాలు మన ఆత్మీయ నేస్తాలు కూడా...! మరి అలాంటి అమూల్యమైన గ్రంథాలు దాదాపు 8 వేల వరకు మీకు అందుబాటులో, ఆంధ్రమహాసభ గ్రంథాలయంలో మీ కోసం ఎదురుచూస్తున్నాయి. వచ్చేయండి..!

## క్రీడలకు ప్రోత్సాహం




**తె**లుగు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు మహాసభ తీవ్రంగా కృషి చేస్తోంది. చదరంగం, క్యారం, స్కేటింగ్ శిక్షణా తరగతుల్ని నిర్వహిస్తోంది. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ జట్టుల్ని ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా జరిగే టోర్నమెంటుల్లో పాల్గొనేందుకు సహకరిస్తోంది.

# తెలుగు సాహిత్య సత్తా

- అంబల్ల జనార్దన్
8850349858

"సార్ నేను ఫలానా. ఔత్సాహిక కవిని, రచయితను."

"ఐతే ? ఆహంకారం ప్రశ్నించాడు."

"సార్ ! నా కవితా సంపుటి 'గుర్తింపు' ఆవిష్కరణ ఆదివారం, ఆరు గంటలకు తెలుగు సంఘంలో ఉంది, మీ లాంటి సాహితీ ప్రియులు విచ్చేసి ఆశీర్వదించాలి."

"అసలు ఎవడివయ్యా నువ్వు ? ప్రొద్దున్నే ఫోన్ చేసి మూడ్ పాడు చేసావ్. అసలు నా నెంబర్ నీకెవరిచ్చారు ?"

"తెలుగు సంఘంవాళ్ళు సార్."

"వాళ్ళకి బుద్ధి లేదు. ఇలా ఎవడు పడితేవాడికి మా లాంటి పెద్దవాళ్ళ ఫోన్ నంబర్లు ఇచ్చేయడమేనా ? నువ్వు ముందు ఫోన్ పెట్టెయ్. వాళ్ళకి గడ్డి పెడతాను." అహంకారం హుంకరించాడు.

"హలో ! ఫలానా గారా ? నమస్కారం సార్ ! నా పేరు అహంకారం. నేటి తెలుగు పత్రిక ఆదివారం అనుబంధంలో మీ బహుమతి కథ అద్భుతం. రాష్ట్రేతరంలో ఉన్న మనలాంటి తెలుగువారి జీవితాల్ని కళ్లకు కట్టించారు. పాత్రచిత్రణ సుపర్బ్. కథనం ఆకట్టుకునేవిధంగా, సహజంగా, సాఫీగా సాగింది. అభినందనలు. మీరూ తెలుగు సంఘం జీవిత సభ్యులని విన్నాను. మీలాంటి గొప్ప రాష్ట్రేతర సాహితీవేత్తకు ఘనసన్మానం ఏర్పాటు చేయించడం నావిధి."

"ధన్యవాదాలు సార్ ! పాతికేళ్ళనుంచి పరాయిరాష్ట్రంలో ఉన్నా మన భాష పట్ల మమకారం చంపుకోలేక ఏదో అటలా అప్పుడప్పుడు రాస్తుంటాను. అవి మీ లాంటి సాహిత్యాభిమానులైన పెద్దవారికి నచ్చడం నా అదృష్టం. ఈ ఘనత, నాది కాదు. మన తెలుగు సాహిత్యానిది. తెలుగు సాహిత్యసత్తాయే మనల్ని కలిపింది."

ఇది నిజంగా జరిగిన సంఘటన ఆధారంగ రయబడింది.

# మహాసభలో మమ్ము మంచిగుంచు తిరుమలేశ



- అంబల్ల జనార్దన్
8850349858

బొంబాయి ఆంధ్ర మహాసభలో
కొలువుదీరిన వేంకటేశ
వెన్నెల చిలికే నీ కృపతో
మమ్ము మంచిగుంచు తిరుమలేశ
ఎంతో మంది పెద్దల నిస్వార్థ
సేవల గుర్తుగా నిలిచిన ఈ భవనం
మరెంతో మంది పుణ్యమూర్తుల త్యాగఫల మహాసదనం
తెలుగు కీర్తి జగమంతా చాటిచెప్పే
ముంబయి తెలుగు వారి నిలయం
ముంబయి నిర్మించిన తెలుగువాళ్ళ చెమటచుక్కలు
సేదదీరే తావుగా నిలిచిన
బొంబాయి ఆంధ్ర మహాసభను
ఇంకా అభివృద్ధిజేసే బలం మాకు ఇవ్వు శేషాద్రివాస
కొలాబా నుండి భీవండి వరకు వ్యాపించిన
తెలుగు వాళ్ళకు మతృసంస్థగా ఉన్న
ఈ మహనీయ మహాసభకు
మన సాహిత్య సంస్కృతుల
సౌరభాన్ని నలుదిశలా
ప్రసరింప జేసే శక్తి
మరింతగా గూర్చు శ్రీనివాస
మాలోని స్వార్థాన్ని పాతాళంలో
పాతిపెట్టి పదిమందికి మేలుజేసే
పనులు జేసే నేర్పు, ఓర్పు,
మాకు ఇచ్చి కాపాడు సప్తగిరి నివాసా
మాలో మాకెప్పుడు గొడవలు రానీయకు
తెలుగు వారందరూ పాలూ నీళ్లలా కలిసి ఉండేలా చూడు
తమ సుఖదుఖాలను పంచుకొని సాంత్వన దీరే అవగాహనిమ్ము
అందరిలో నిన్ను జూసే బుద్ధి మాకు ఇవ్వు ఓ జగద్రక్షకా

# శ్రీ వేంకటేశ్వర పూజా మందిరం ట్రస్ట్

# SRI VENKATESWARA POOJA MANDIR TRUST

**For Correspondence : The Bombay Andhra Mahasabha & Gymkhana**
Plot No. 10-C, Lakhamsi Napoo Road, Hindu Colony, Dadar (E), Mumbai - 400 014
Tel.: 2414 4377 / 88, E-mail : mahasabha@gmail.com

## ఆహ్వాన పత్రిక



## INVITATION

## శ్రీశ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవము

స్వస్తిశ్రీ శ్రీ చాంద్రమాన శ్రీ విలంబి నామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి ఆదివారము శతభిష నక్షత్రయుక్త అభిజిత్ లగ్నమందు
అనగా తేది **21.10.2018** ఉదయం **10.00** గం॥ నుండి మధ్యాహ్నం **12.30** గం॥ వరకు
ఆంధ్రమహాసభలో వేంచేసియున్న శ్రీమద్ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన

## శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి జగన్మాతలు శ్రీదేవి, భూదేవిలకు

తిరు కళ్యాణ మహోత్సవము జరుపబడును. ఉదయం **9.30** గంటలకు గోపూజ మరియు స్వామివారి ఊరేగింపు కలదు,
భక్తులెల్లరు విచ్చేసి స్వామివారి, అమ్మవార్ల కృపకు మరియు మహాప్రసాద పాత్రులు కాగలరని ప్రార్థన. ఇవియే అనేక శుభలేఖార్థములు.

## SRI SRIDEVI, BHUDEVI SAMETHA SRI SRINIVASA KALYANA MAHOTSAVAM

on Sunday 21.10.2018 between 10.00 am to 12.30 pm
(Sri Vilambi Nama Samvatsara Ashwayuja Shudha Dwadashi Shatabhisha Nakshatra Abhijeet Lagnam)

Venue: **THE BOMBAY ANDHRA MAHASABHA & GYMKHANA**
10/C, Lakhamsi Napoo Road, Dadar (E), Mumbai - 400 014, Tel: 022-24144377 / 88

All are requested to attend with family to participate in the Kalyanotsavam
and have the Divine Blessings of Lord Balaji & have Mahaprasadam

**A.S.R. Krishna Prasad**
Chairman - SVPMT

**Pothu Rajaram**
BOT Chairman - BAMS

**Sanku Sudhaker**
President - BAMS

**S.V. Rama Rao**
Secretary - SVPMT

**Vasala Shrihari (Vamshi)**
BOT Secretary - BAMS

**Talla Naresh**
General Secretary - BAMS

Note: 1. Devotee couples wish to perform Sri Srinivasa Kalyanam are requested to remit Rs. 1001/- & register their Names & Gothram with Mahasabha.
2. Devotees wish to have Poojarchana are requested to remit Rs. 251/- & register their names & Gothram with Mahasabha.

## తేది 21.10.2018, ఆదివారము సాయంత్రము 6.30 గం॥ లకు తెలుగు భాషా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

వ్యవహారిక భాషోద్యమకారులు శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు గారి జన్మదినమైన 29 ఆగస్టును తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ. అలాగే పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు గారి జన్మదినమైన 9 సెప్టెంబర్‌ను తెలంగాణా భాషా దినోత్సవంగా జరుపాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది.

కొత్త కార్యవర్గానికి తగిన సమయం లేకపోవడం వలన మన భాషా దినోత్సవాలు జరుపే వీలుకాలేదు. ఆకార్యక్రమం తేది 21.10.2018, ఆదివారము సాయంత్రం 5.30 గంటలకు మహాసభలో జరుపేందుకు కార్యవర్గం నిర్ణయించింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాడ్రేవు సుందర్రావు మరియు సంగిశెట్టిశ్రీనివాసు గారు రానున్నారు. కావున సాహితి అభిమానులు మరియు సభ్యులు అదిక సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమమును విజయవంతం చేయగలరని అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి మరియు కార్యవర్గ సభ్యులు కోరుచున్నారు.

## తేది 27.10.2018, శనివారము సాయంత్రము 6.00 గం॥ లకు విజయదశమి విజయోత్సవముల వేడుకలు












**తేది 04.11.2018, ఆదివారము ఉదయం 10 గం॥ లకు SSC & HSC లో ఉత్తీర్ణులైన ఉత్తమ విద్యార్థులకు సన్మానం**




విజయ దరహాసాలు

# నాడు చెత్తకుండీలో చిన్నారి....
# నేడు ఆసిస్టెంట్ కమిషనర్ హోదాలో...

మట్టిలో మాణిక్యం... ఏ తల్లి కన్న బిడ్డో... చెత్తకుప్ప పాలైంది... అదృష్టం బావుండి ఓ నాన్న కాని నాన్న కంట పడింది. అసోంలోని తీన్ సుఖీయా జిల్లాకు చెందిన సోబరన్ బండిమీత కూరగాయలు పెట్టుకుని వీధివీధి తిరుగుతూ అమ్ముతుండేవాడు. అదే ఆధారంగా బతుకుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ పెద్దవారు కావడంతో వారిని చూసుకునే బాధ్యత తనపై పడడంతో పెళ్లి చేసుకోవాలని కూడ ఆలోచించలేకపోయాడు. రోజూలానే ఓ రోజు కూరగాయలు అమ్మి చీకటి పడిన తరువాత ఇంటికి వస్తున్నాడు. ఇంతలో ఓ చిన్నారి ఏడుపు వినిపించింది. తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన ఓ పసికందు చెత్తకుప్పలో ఏడుస్తూ కనిపించింది. పరుగున వెళ్లి చుట్టూ చూశాడు. పాప తాలూకూ ఎవరూ కనిపించలేదు. ఏ జన్మ బంధమో నాకోసమే పుట్టిందేమో అనుకుని ఆప్యాయంగా ఆక్కున చేర్చు కున్నాడు. అమ్మానాన్నా అన్నీ తానై పెంచి పెద్ద చేశాడు. 25 ఏళ్లు వచ్చిన ఆ అమ్మాయి.. నాన్నా నీ కష్టం ఊరికే పోలేదు.. అసిస్టెంట్ కమిషనర్ అయ్యానంటూ తనకి ఉద్యోగం వచ్చిన ఆర్డర్స్ తండ్రి సోబరన్ చేతిలో పెట్టింది.

చిన్నారి రాకతో తన జీవితం మారిపోయింది. తన జీవితంలో వెలుగులు పంచిన ఆ చిన్నారికి జ్యోతి అని పేరు పెట్టాడు. రక్తం పంచుకు పుట్టిన బిడ్డ కోసం తండ్రి పడే తపన, కష్టం అంతా జ్యోతి కోసం పడ్డాడు సోబరన్ జ్యోతిని మంచి స్కూల్లో జాయిన్ చేశాడు. బాగా చదవాలంటూ ప్రోత్సహించాడు. జ్యోతి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఓ తండ్రిగా అందమైన కలలు కన్నాడు. కష్టం తెలియకుండా, కన్నీళ్లు రానివ్వకుండా జ్యోతిని పెంచి పెద్ద చేశాడు. ఫలితంగా జ్యోతి కంప్యూటర్ సైన్స్‌లో పట్టా తీసుకుంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరైంది. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్వ్యూలో కూడా విజయం సాధించి ఇన్‌కమ్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రభుత్వం నుంచి ఉత్తర్యులు అందుకుంది. బిడ్డ విజయాన్ని చూసిన తండ్రి సోబరన్ కళ్లలో ఆనంద భాష్పాలు చూసి జ్యోతి తల్లడిల్లిపోయింది. కన్నీళ్లతో తండ్రి పాదాలు తడిపేసింది. వీధిపాలు కావలసిన జీవితాన్ని విద్యావంతురాలిని చేసి ప్రపంచం ముందు విజేతగా నిలబెట్టిన తండ్రికి మనసులోనే ధన్యవాదాలు తెలిపింది.

# పరువు – హత్య

– అంజయ్య గౌడ్
90961 63962

పరువు కోసము హత్యా ...
పరపతి కోసము హత్యా...
ఇంకెక్కడి పరువు.. ప్రతిష్ట
రానే వచ్చిందిగా అప్రతిష్ట
హత్యలు చేయడంతో... హంతకుడిగా మారడంతో
పరువెలా పట్టుకుని వేలాడుతుంది...
పలాయనం చిత్తగించక
ప్రతిష్ట యెలా తిష్ట వేస్తుంది.. ముఖం చాటేయక...

కోటి రుపాయలు ఖర్చు పెట్టి
ఖూనీ చేపిస్తే నిలుస్తుందా పరువు
కూటికి లేనివారికి గుప్పెడు
మెతుకులు దానం సేస్తే వస్తుంది కాని...
రక్తం కళ్ల సూస్తే నిలుస్తుందా పరువు
రక్తం ఇస్తే వస్తుంది కాని...
పరువంటే ప్రాణం తీయడం కాదు...
ప్రాణం పోయడం...

పెరుగుతుంది శాస్త్ర విజ్ఞానం..
తరుగుతున్నది లోకజ్ఞానము
పెరుగుతున్నది అనాగరికత.. తరుగుతున్నది నాగరికత
పైసలిస్తే చాలు ప్రాణాలు తీసె కిరాయి హంతకులు
ఉన్నంతసేపు తప్పవా యీ అకృత్యాలు...
కోళ్లు గొర్రెలు కోస్తే వానికైన ఉంటుంది కొంతైనా భీతి
మనుషులను చంపెవాడికి లేదేలనో కొంతైన పాపపు భీతి

సమాజానికి మార్గ దర్శనం యువత
కాని నడుస్తోంది చెడు నడత
ప్రేమించడం తప్పుకాదు
నువ్వు ప్రేమించిన వాని కోసం
నిన్ను ప్రేమించిన వారిని వదులు కోవడం తప్పు
ప్రేమిస్తే ఒప్పించాలి
లేదంటే తప్పు కోవాలి
క్షణికావేశ నిర్ణయము
సంసారంలో ప్రళయము
తత్ఫలితం సమాజం...
పడుతోంది చెడు మార్గం...


పట్టపగలు నడి రోడ్డుపై పరువు హత్యాయత్నం.

❋❋❋

# భిన్నత్వంలో ఏకత్వం

– గందూరి లక్ష్మినారాయణ
94239 56248

సీ. భరతదేశపు హద్దు భద్రులై రక్షించ
శత్రు భీకరమైన సైన్యముండి
పంటలు పండించి ప్రజల యాకలి దీర్చు
మట్టి బిడ్డలు మాకు మద్దతుండ
శస్త్ర చికిత్సచే సత్త్వములను బ్రోచు
వైద్య రాజౌషధ భాండముండు
సంగ్రామమే వస్తే శత్రు సంహారమై
శాస్త్రవేత్తల జ్ఞాన శస్త్రముండ

తే.గీ. వంద కోట్లను మించిన భరత జాతి
యొక్కటని విన్న వైరుల పిక్క చెదురు
అందమైన నా దేశము నందు బుట్ట
సేవ జేతురు మరిమరి చిత్తములర.

సీ. ఉత్తుంగ హిమగిరు లుత్తరంబున నుండ
కబలించ కన్నెత్తి గాంచు నెవడు
హిందూ మహాంబుది హితకార దక్షిణ
దిశనుండ నేరిపు తేరి చూచు
బంగాళఖాతము పొంగార తూర్పున
గనుచుండ దండెత్తు ఘటికు డెవడు
ప్రభల అరేబియా పడమర దిశనుండ
నడుగు ముందుకు వేయు పిడుగెవండు

తే.గీ. పెట్ట నటువంటి కోటలు చుట్టునుండ
నన్ను కన్నెత్తి గను గుండె లెన్నికలవు
విశ్వ విఖ్యాత విజ్ఞాన వేద శాస్త్ర
భరతదేశము నా పేరు భవ్య ధాత్రి.

తే.గీ. భిన్న కులములు మతములు భిన్న భాష
భిన్న సంస్కృతుల్ వలువలు భిన్నమైన
కలసి భిన్నత్వమందు నేకత్వమౌచు
నన్ను రక్షించు నా జాతి నాకు బలము.

❋❋❋





## ముంబయి, భివండీలో

# బతుకమ్మ పండుగు

- అంబల్ల జనార్దన్.
8850349858

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత, ముంబయిలో, భివండీలో బతుకమ్మ పండుగకు ఓ కొత్త ఊపు వచ్చింది. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల వారు వేల సంఖ్యలో ముంబయి వచ్చి సామూహికంగా బతుకమ్మ ఆడుతున్నారు. తమ సాంప్రదా యాన్ని, సంస్కృతిని కాపాడుకుంటున్నారు. ఈ సంవత్సరం ముంబయిలోని వివిధ ప్రాంతాల్లో మరింత అట్టహసంగా జరుపుతున్నారు. ఆ బతుకమ్మ సంబురాలు వీడియో షూటింగ్ కూడా జరుపడంవల్ల, ఆ వీడియోలను వాట్సాప్, ఫేస్‌బుక& ద్వారా ప్రచారం కలుగడంతో తెలుగు ఆడపడుచులు మరింత ఉత్సాహంగా బతుకమ్మ సంబురాల్లో పాల్గొంటున్నారు. ముంబయిలోని తెలుగు వారిది మూడు వందల ఏళ్ళ చరిత్ర. తెలంగాణ వాసులు ముందుగా, భవననిర్మాణ కూలీలుగా ముంబయికిరాగా, ఆ తర్వాత నేత కార్మికులు వారిని అనుసరించారు. ముంబయిలోని ఎన్నో చారిత్రక కట్టడాల్లో ఇంకింది తెలుగు బడుగుల చెమటే. ప్రస్తుతం, తెలుగు మాట్లాడేవారు, తెలుగు మూలాలున్నావారు పదిహేను లక్షలకుపైగా ముంబయిలో ఉంటారని అంచనా. ముంబయికి సుమారు యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న భివండీ పట్టణంలో ఇంకోమూడు లక్షల తెలుగు వారున్నారు. ముంబయి, భివండీల్లో నివసించే తెలుగు వారిలో ఎక్కువశాతం తెలంగాణ ప్రాంతానికి చెందిన బడుగు జీవులే. అందులోనూ కొన్ని జిల్లాల వారు కొన్ని ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఉదాహరణకి కామాటీపురాలో కామారెడ్డి చుట్టుపక్కలవారుండగా, లోయర్ పరేల్, వర్లీ, ఖేడ్గల్లీ, ప్రభాదేవి విభాగాల్లో నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలవారి సంఖ్య ఎక్కువుంది. అదే దాదర్, నాయ్‌గావ్, ధారావి, సాయన్ మొదలగుచోట్ల నల్గొండ, మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాల వారు స్థిరపడ్డారు. దక్షిణ ముంబయిలోని పై ప్రాంతాల్లోని వారు కాలక్రమంలో, పలు కారణాలవల్ల నగరశివార్లకు తరలివెళ్లారు.

దక్షణ ముంబయిలోని పలుచోట్ల ఉండే తెలంగాణ ప్రజలు బత్కమ్మ లేక బొడ్డెమ్మ లాంటి పండుగులు ఉత్సాహంగా జరుపుకుంటూ, తమ ఉనికిని కాపాడుకుంటున్నారు. ఠాణే, కల్యాణ్, అందేరి, కాందీవలి మరియు బొరీవల్లీ లాంటి నగరశివార్లల్లో కూడా ఈ పండుగ జరుపుకుంటారు. పగలంతా ఏవో పనుల్లో నిమగ్నమైఉన్న శ్రామికులు దసరా నవరాత్రుల్లో ప్రతిరోజూ రాత్రి భోజనాలైంతర్వాత, వారి వీలును బట్టి దాదాపు రెండు గంటలు బతుకమ్మ ఆడుతారు. బత్కమ్మను మన తెలంగాణ జిల్లాల్లో లాగానే పేర్చుతారు. వీరిలో కళాత్మకత పాలు ఒకింత ఎక్కువేమో, బత్కమ్మలను ఎన్నో ఆకృతుల్లో అలంకరిస్తారు. బత్కమ్మకు పూజ చేసి, మధ్యలో పెట్టి, చప్పట్లు కొడుతూ చుట్టూ తిరుగుతూ ఎన్నో పాటలు పాడుతారు.

| | |
|---|---|
| **బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోలూ** | **నీ బిడ్డెలెందారే కోలూ** |
| **నీ బిడ్డె నీలగౌరీ కోలూ** | **నీత్యమల్లె చెట్టెక్కే కోలూ** |
| **నిత్యమల్లె చెట్టూకే కోలూ** | **నీల్లైనా పోసే కోలూ** |
| **నీల్లకంచులోనూ కోలూ** | **కొత్తచీరే కట్టే కోలూ** |
| **ఆ చీరకట్టుకొనీ కోలూ** | **కొంగలబాయీకి పోయే కోలూ** |
| **కొంగలన్నీ కలిసి కోలూ** | **కొంగంతా జూసే కోలూ.......** |

ఇలా వారి వారి ప్రాంతాల్లో పాడే పాటలు నేర్చుకొని పాడుతా రు. కొందరు మొదటిరోజు ఆటకు ఎంగిలిపువ్వు బత్కమ్మ అంటే మరికొందరు రెండోరోజు ఆడే ఆటను అట్లా అంటారు. తొమ్మిదోరోజు బత్కమ్మను తెలంగాణలో వలె సద్దుల బత్కమ్మ అంటారు. మామూలుగా మొదటి ఎనిమిది రోజులు ఆడపడు చులు తక్కువసంఖ్యలో పాల్గొంటే, ఆఖరునాడు మాత్రం, ఎని మిదేళ్ళ పిల్లలనుండి ఎనభైఏళ్ళ ముత్తైదువలు సద్దుల బత్కమ్మ ఆడుతారు. ఒక్కోచోట చిన్నపిల్లలను బత్కమ్మ ప్రక్కన కూచోబెట్టి చప్పట్లు కొడుతూ చుట్టూ తిరుగుతూ ఎన్నో పాటలు పాడుతారు. బత్కమ్మను పేర్చడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. పోటీలుపడి ఒకరికంటే ఒకరు ఎత్తుగా, వివిధ ఆకృతుల్లో వాటిని పేరుస్తారు.

సద్దుల బత్కమ్మనాడు మేళతాళాలతో తరలివెళ్ళి, పూజలుచేసి, అరేబియా సముద్రంలో బత్కమ్మను నిమజ్జనం చేస్తారు. భివండీలనైతే అక్కడి వరాలదేవి దగ్గరి చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత గుంపులు గుంపులుగా సముద్ర

# కుటుంబం...

– జక్కని గంగాధర్
090763 52347

కుటుంబంలో....
అనుబంధాలు బలహీనమైనప్పుడు
మనసు విప్పి మాట్లాడుకునే పరిస్థితులు...
కరువైనప్పుడు... బాధను పంచుకునే....
సంబంధం లేని బయటి వ్యక్తుల కోసం...
వెదకాల్సి వస్తుంది...!!

అందుకే...
కుటుంబ సభ్యులు తరచుగా చిన్న సభలా...
ఏర్పరచుకుని
కలసి మెలసి... మనసులోని
మంచీ–చెడులను పంచుకుని...
చర్చించుకోవడం ఎంతైనా... మంచిది...!!

ఎవరి మనసులో ఏముందో...
తేట తెల్లమై వారి వారి...
అభిరుచుల ననుసరించి....
మసలుకునే పరిస్థితులు నెలకొంటాయి...!!

కుటుంబం...
అపవాదు పాలు కాకుండా...
కాపాడుకొనుటయే గాక...
పురోభివృద్ధికి తోడ్పడి
ప్రశాంత నిలయానికి
దారి తీస్తుంది...!!!

❀❀❀






/ చెరువు తీరంలో కూర్చొని తమ తమ ఇళ్ళనుంచి తీసుకొచ్చిన తిండి దినుసులను ఆరగిస్తారు. గారెలు, పోలెలు, చేగోడీలు, బబ్బెరగుడాలు, పులిహోర, పోపువేసిన అటుకులు, ప్యాలాలు మొదలగు పదార్థాలను ఒకరివొకరు పంచుకుంటూ, ఆడుతూ, పాడుతూ భుజిస్తారు.

కామాటీపుర ప్రాంతంలో ఉండేవారు గిర్‌గావ్ చౌపాటి (చర్నీరోడ్ సముద్రతీరం), లోయర్ పరేల్, వర్లీలోని వారు వర్లీ చౌపాటీలో, దాదర్, నాయ్గాం విభాగాల్లో ఉండేవారు శివాజీ పార్క్ చౌపాటీలో బత్కమ్మలను నిమజ్జనం చేస్తారు.

భివండీలో భారీ ఎత్తున జరిగే బత్కమ్మ పండుగ –

తెలంగాణకు చెందిన దాదాపు మూడు లక్షల ప్రజలున్న భివండీలో జరిగే బత్కమ్మ సంబురాలు చూడడానికి మన రెండు కళ్ళూ చాలవు. అక్కడ గల్లి గల్లీల్లో, వాడవాడల్లో ముత్తైదువలు ఉత్సాహంగా, దసరానవరాత్రులూ బత్కమ్మ ఆడుతారు. అలా కొన్ని వందల గుంపులు బొడ్డెమ్మ సంబురాల్లో పాల్గొంటారు. స్థానిక కవి శ్రీ గందూరి లక్ష్మినారాయణ గారు మార్కండేయుని చరిత్ర, తదితర విషయాలను బత్కమ్మ పాటలుగా రాసి అక్కడి వారితో అడించారు, పాడించారు. కొంతమంది తెలుగు కార్పొరేటర్ లున్న "భివండీ నిజాంపూర్ మునిసిపల్ కార్పొరేషన్" వారు మన ఈ పండుగను గుర్తించి, ఎన్నో ఏర్పాట్లు అధికారికంగా చేయడం గమనార్హం. సద్దుల బత్కమ్మనాడు కొన్నివేలమంది స్థానిక వరాలదేవి చెరువు ప్రాంతానికి చేరుతారు. తమ తమ బత్కమ్మలకు పూజలు చేసి చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత తమతోతెచ్చిన ఫలహారాలు సామూహికంగా ఆరగించి ఆడి పాడుతారు. వరాలదేవి చెరువుకు చేరే దార్లల్లో వివిధ తెలుగు సంస్థలు ఉచిత ప్రసాదాల, మంచినీళ్ళ పంపిణీలో పాలుపంచుకుంటాయి, కార్పొరేషన్ వారు ప్రాంతాన్నంతా రంగురంగుల విద్యుద్దీపాల తో అలంకరిస్తారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేస్తారు. ఆ రోజు అర్ధరాత్రిదాకా ఆ ప్రాంతం తెలంగాణ మనుషుల వంటకాల వాసనలతో ఘుమఘుమ లాడుతుంది.

అలా ముంబయి భివండీలోని తెలంగాణ ప్రజలు తమదైన బత్కమ్మ పండుగను తమకే ప్రత్యేకమైన శైలిలో జరుపుకుంటూ, ముంబయి, భివండీల్లో తెలంగాణ బావుటాను రెపరెపలాడిస్తున్నారు.

# నా ఉద్యోగ పర్వంలో
## ఇందోర్ ప్రస్థానం



**- జిల్లా గోవర్ధన్**

ఆగస్టు 2008, బాంద్రా ప్రావిడెంట్ ఫండ్ ఆఫీసులో నేను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. మా స్టాఫ్ యూనియన్‌కు కూడా ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తించే రోజులు అవి. డిల్లీ ప్రధాన కార్యాలయం నుండి మా బ్యాచ్ వాళ్లకు అసిస్టెంట్ కమీషనర్ పదోన్నతులు రానున్నట్లు వినికిడి. గ్రేడ్ వన్, ఇండియా క్యాడరు, పోస్టింగ్ ఎక్కడయినా వేయచ్చు. మహారాష్ట్రలో మా ఈ పి.యఫ్ కార్యాలయములు 11, యిక గుజరాత్ లోని వాపి, సూరత్ కార్యాలయాలు కూడ ముంబైకి దగ్గరే కానీ అప్పుడు పాలసీబట్టి, ప్రమోటీలందరిని, వారి స్వంత రాష్ట్రాలలో కాకుండా, వేరే ప్రాంతాలకు పంపిస్తారని మరో వార్త. అంటే యీ స్టేట్‌లో ఉండదు.

మరి నా పోస్టింగ్ ఏ మూలనుంటుందో, ప్రమోషన్ విని సంతోషం, పోస్టింగ్ ఆలోచించి నప్పుడు గుండెలో రైళ్ళు ! అయినా, రోట్లో తల దూర్చి రోకళ్ళకు భయపడటం ఎందుకు పిచ్చి కాకపోతే ? యిక అక్టోబరు 2008, మొదటి వారంలో అనుకున్న ఆర్డర్ రానే వచ్చింది. 18 మంది పదోన్నతుల్లో నేనూ ఉన్నాను. నా పోస్టింగ్ ఇందోర్ రీజనల్ కార్యాలయము మరి వెళ్లాల్సిందే. ఉద్యోగికి దూర దేశం లేదంటారుగదా. ఇందోర్ కార్యాలయంకు పంపిస్తూ నన్ను రిలీవ్ చేశారు బాంద్రా వాళ్ళు. ఒక రెండు రోజుల తర్వాత ఉదయం ఏర్ యిండియా విమానం లో ఇందోర్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యాను నేను.

ముంబైకి 560 కి.మీ. దూరం ఇందోర్ నగరం, మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి వాణిజ్య నగరం. రాజధాని భోపాల్, అటు నుండి 3 గంటల ప్రయాణం. ఒకప్పుడు మహారాష్ట్రకు చెందిన హొల్కర్ కుటుంబీకులు పాలించిన యీ నగరంలో యిప్పుడు లక్షకు పైగానే మరాఠీ వాళ్ళు ఉంటారు. ప్రస్తుత లోక సభ స్పీకరు శ్రీమతి సుమిత్రా మహాజన్,"ఇందోర్ కీ కొంకణ్ కన్యా" అని చెప్పుకుంటారు. 1989 నుండి వరుసగా ఆరవసారి పార్లమెంటుకు ఇందోర్ నగరం నుండి ఎన్నికయిన బీజేపి నాయకురాలు, మహారాష్ట్ర మహిళ. విమానాశ్రయం నుండి బయటకు రాగానే స్థానిక అసిస్టెంట్ కమిషనర్ నాయర్ గారు నన్ను రిసీవ్ చేసుకుని, కార్యాలయ కారులో కార్యాలయానికి తీసుకెళ్ళారు. రేస్ కోర్స్ రోడ్‌లోని భవిష్యనిధి భవన్, ఏడంతస్తుల భవనం, 270 మంది ఉద్యోగులు ఉంటారు.

కారు దిగి మేము మా రీజినల్ కమీషనర్ శ్రీ కె.ఎల్. తనేజా సారు కేబిన్‌లోకి వెళ్ళాము. నన్ను చూస్తూనే, " ఆయియే జిల్లాజీ, వెల్కమ్ జిల్లాజీ వెల్కమ్ టు ఇందోర్" అంటూ చేయి కలిపి, కుర్చీ చూయించాడు కూర్చోమని, మహారాష్ట్ర ముంబై ఆఫీస్ వివరాలు అడుగుతూ, ఇందోర్ ఆఫీస్ పని తీరు, కార్యాలయ సిబ్బంది గురించి వివరించారు "యిప్పటికయితే మా దగ్గర యూనియన్ మేనేజ్‌మెంట్ సంబంధాలు చాల బావున్నాయి. నీకేమి ఇబ్బంది ఉండదులే" అంటూ నావైపు చూసి కన్ను గీటారు. యూనియన్ కార్యకర్త అని, బదులుగా నేను, "సర్, నేను యిప్పుడు మేనేజ్‌మెంట్ క్యాంపులోకొచ్చా కదా, యిప్పుడు అది నా పోర్ట్ ఫోలియో కాదు మరి" అనగానే సర్ నవ్వారు. ఏడవ అంతస్తులో నా క్యాబిన్ కేటాయించినట్లు, మధ్యాహ్నం వారు వర్క్ అల్లోట్మెంట్ ఆర్డర్ వస్తుందని చెప్తూ, సాయంత్రం తన కారులో, గెస్ట్ హౌస్‌కి రావాలని చెప్పారు. సరే అని చెప్పి నాకు అల్లోట్ చేసిన క్యాబిన్‌కి వెళ్ళాను నేను.

సాయంత్రం 7 గంటలకు నయా దునియా ప్రెస్‌లేన్ లోని, మా స్టాఫ్ క్వార్టర్ గెస్ట్ హౌస్‌కి చేరుకున్నాము మేము, మూడు ఏ.సీ. బెడ్ రూమ్‌లతో కార్పెట్ పరచిన పెద్ద హాలు,

ఫేస్‌బుక్ నుండి

# విలువ



"ఏమిటోనోయ్ ! అస్తమాను పెన్ను ఎక్కడ పెట్టానో మరచిపోతూ ఉంటాను"

"ఏందుకు అలా ?"

"ఏమిటో మరి ఈ మతి మరుపు ! అందుకే నేను ఎప్పుడో ఖరీదైన పెన్నులు వాడడం మానేశాను. చీప్ పెన్ను మాత్రమే వాడుతున్నాను. అది మరిచిపోయి పారేసినా బాధ అనిపించదులే ! అయితే నా బాధ ఈ మతిమరుపు గురించే"

"నేను ఒక సలహా ఇవ్వనా ?"

"మతిమరుపు పోతుందా?"

"చెప్పలేను ! నీ మీద ఆధారపడి ఉంటుంది !"

"ఏమిటది?"

"నువ్వు కొనగలిగినంత అత్యంత ఖరీదు అయిన పెన్ను కొని వాడుతూ ఉండు. అప్పుడు కూడా నువ్వు మరిచిపోతావా?, నీ మరుపు పోతుందా ? చూద్దాము"

"తప్పకుండా చేస్తాను"

ఆర్నెల్ల తర్వాత స్నేహితుడు ఫోన్ చేసి పెన్ను మరిచిపోతున్నావా ? అని అడిగాడు.

"అబ్బే ! నువ్వు చెప్పాక 22 కేరట్ల బంగారు పెన్ను కొన్నాను. దాని విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నాను. ఈ ఆరునెలల్లో ఒక్క రోజు కూడా నేను దానిని ఎక్కడా మర్చిపోలేదు"

"నువ్వు పెన్ను మర్చిపోకపోడానికి కారణం నువ్వు దానికి ఇచ్చిన విలువ"

మనం దేనికి విలువ ఇస్తామో దానిపట్ల మనం జాగ్రత్తగా ఉంటాము.

వస్తువుకు విలువ ఇస్తే దాన్ని కోల్పోము

ఆరోగ్యానికి విలువ ఇస్తే ఏమి తినాలో, ఏమి తినకూడదో, ఎంత తినాలో, ఎపుడు తినాలో అన్నీ జాగ్రాత్తగా ఉంటాము.

స్నేహనికి విలువ ఇస్తే స్నేహితుడిని గౌరవిస్తాము

డబ్బుకు విలువ ఇస్తే ఆచి తూచి ఖర్చు పెడతాము

కాలానికి విలువ ఇస్తే టైం వేస్ట్ చెయ్యము

బంధాలకు విలువ ఇస్తే వాటిని తెంచుకోము

దేనికి ఎంత విలువ ఇవ్వాలో తెలుసుకుని వ్యవహరించడం మనం నేర్చుకోవలసినది.

మరోవైపు అటాచ్డ్ డైనింగ్ రూమ్, కిచెన్, హాలులో కలర్ టీ.వీ. మరో మూలకు అల్మారాలో హిందీ నవలలు, కవితా పుస్తకాలు నీట్‌గా అమర్చ బడ్డాయి (హిందీ అధికార భాష కదా). మమ్మల్ని చూసి ఒక ఐదడుగుల ఛామయఛాయ వ్యక్తి, పేలిపోయిన కుర్తా పైజామాలో, నమస్తే చేస్తూ, ప్రక్కనే నిలుచున్నాడు. అతని వైపు చూస్తూ మా ఆర్.సీ. (రీజనల్ కమీషనర్) గారు "యితడు రమేశ్ చౌహాన్, మన గెస్ట్ హౌస్ వంటవాడు. రేపటి నుండి నీకు కావలసిన నల భీమ పాకాల వంటలు యితడు చేసి పెడతాడు" అంటూ నవ్వేశాడు. అతను నా వైపు చూస్తూ మరో సారి నమస్కారం చేశాడు.

ఇండోర్ ఆఫీసులో నేను చేరిన మూడు రోజుల తర్వాత, శ్రీకాంత్ చౌదరి అనే మరో ఆఫీసర్, కాన్పూర్ నుండి రిపోర్టు చేశాడు. ఆయనకూ నాతో పాటే గెస్ట్‌హౌస్‌లోనే మకాం. మా యిద్దరికి తోడు తనేజా సర్, ముగ్గురికి రమేశ్ కుక్, ఉదయం టీ బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయటం. తర్వాత కొన్ని చపాతీలు, సబ్జీ టిఫిన్ బాక్స్‌లో పెట్టి 9 గంటలకు ఆఫీస్‌కి పంపడం రోజు వారి చర్య. మేము ఆఫీస్ కెళ్లిన తర్వాత, రమేష్ ఒక తోపుడు బండిలో కూరగాయలు పెట్టుకుని, కాలని వీధుల్లో తిరుగుతూ అమ్ముకుని, (వేన్నీళ్ళకు చన్నీళ్ళు) మధ్యాహ్నాం ఔట్‌హౌస్‌లో చేరుకుంటాడు. నెలకు ఒకటి రెండు సార్లు ఇండోర్‌కు 20 కి. మీ. దూరంలో తన ఊరికి వెళ్తాడు భార్య, కూతురును కలవటాని కి. ముసలి తల్లితండ్రులు కూడా అక్కడే ఉంటారట. రమేష్ ఊరెళ్ళి నప్పుడు నేను శ్రీకాంత్ గారు కుక్‌కు వందో రెండొందల లో యిచ్చే వాళ్ళం. అదే ఎంతో పెద్ద మొత్తం దొరికి నట్లు ఫీలయ్యేవాడు అతడు. రమేష్ లేనప్పుడు మాకు దగ్గరలోని మెస్ నుండి టిఫిన్ కెరీర్ తెప్పించే వాడు మా కేర్‌టేకర్.

ఒకసారి ఊరుకు వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళిన కుక్ నాలుగు రోజులైన రాలేదు. మొబైల్ కాల్‌కి జవాబు లేదు. నేను ఆఫీస్‌లో ఉన్నప్పుడు ఒకనాడు మధ్యాహ్నము, నా క్యాబిన్‌లో కొచ్చి నిలబడ్డాడు కుక్. ముఖంలోని విషాద ఛాయలు గమనిస్తు "ఏమిటి సంగతి రమేష్" అని అడిగా. కళ్ల నుండి నీళ్ళు దొర్లుతుంటే "సార్, మా భార్య ఆరోగ్య పరిస్థితి బాగాలేదు, మలేరియా జ్వరం, నిన్న  నాగ్డా సివిల్ ఆసుపత్రిలో జాయిన్ చేయించాను కాని మందులకు డబ్బులు లేవు సార్, ఒక మూడు వేలు యిస్తారేమోనని..." గద్గద స్వరంతో ఆ తర్వాత మాట్లాడ లేక పోయాడు.ముంబై మధ్య తరగతి వీధుల్లో పుట్టి పెరిగిన నేను, గ్రామీణ గరీబి గురించి కథల్లో చదవటమే గాని, యిప్పుడు యీ కుక్ కళ్ళల్లో ప్రత్యక్షంగా చూసిన అనుభవం కాస్తా ఆలోచించి "ఆవో మేరే సాథ్" అంటూ బయటకు నడిచా,

ఆఫీస్ ప్రక్కనే ఉన్న స్టేట్ బ్యాంక్ ఏటిఎం నుండి మూడు వేల క్యాష్ విత్‌డ్రా చేసి, రమేష్‌కిస్తూ, భార్య ఆరోగ్యం జాగ్రత్త అంటూ, త్వరగా డ్యూటీకి వచ్చేయ్ అని సలహా యిచ్చాను. "బహూత్ బహూత్ ధన్యవాద్ సాబ్" అంటూ, తన పాత సైకిల్ ఎక్కి ఊరి వైపు మరలాడు రమేష్ 20 కి.మీ. దూరం, రమేష్ గెస్ట్‌హౌస్‌కు రాక పోవటంతో ఆర్.సీ. గారు వేరే కుక్ ని వెతక వలసిందిగా ఆర్డరు పురమాయించినాడు. యచ్.ఆర్ వాళ్ళకి అది విన్న నేను "సర్ వాళ్ళ భార్య హాస్పిటల్‌లో ఉందిట, మరో నాలుగు రోజులు చూద్దాం" అనగానే నా వైపు అదోలా చూసాడు అయన "అవునూ, వాడికి నువ్వు డబ్బులు ఏమో సర్దావట?" నా కళ్లలోకి చూస్తూ ప్రశ్న "నిజమే సర్, మెడిసిన్‌కి డబ్బు లేదంటే మూడు వేలు యిచ్చా" నా జవాబు "మరే ఆ మూడు వేలు గంగామయ్యా ఒడిలో వేసాననుకో, యిక వాడెందుకొస్తా డు యిప్పట్లో ఇందోర్‌కి" అని తన పనిలో మునిగిపోయాడు ఆయన. ఈవిషయం యింకా పొడిగించలేదు. అసలుకి మోసం మరి బాస్‌కు ఎదురు నిలుచుని విరుద్ధంగా మాట్లాడటం, గాడిద కాళ్ళ వెనక తిష్ట వేయటం, కోరి తన్నులు తెచ్చు కోవడమే అంటారు. యిక ఆఫీసర్లకు, తోటి అధికార్లు స్టాఫ్ వాళ్ళు చేసే చాటు మాటు పనులు, రహస్య గూఢచారుల ద్వారా ఎప్పటికప్పుడు భలేగా తెలుస్తుంటాయి.

మొత్తానికి, ఒక రోజు ప్రొద్దున 7 గంటలకు, తనేజా సర్, నేను, శ్రీకాంత్ గారు గెస్ట్‌హౌస్ వరండాలో హాయిగా పిచ్చా పాటిలో మునిగాము సర్ ఉదయం చాలా హ్యాపి మూడ్‌లో ఉన్నాడు, బాస్ మూడ్ బావుంటే ఆరోజు శుభ సూచకం అనుకో వచ్చు. హర్యానా స్టైలిష్ హిందీలో జోక్స్. సరిగ్గా అప్పుడే అడుగులో అడుగు వేసుకుంటూ వస్తున్నాడు రమేష్ కుక్, అంతే... తోక త్రొక్కిన త్రాచు అయ్యాడు బాసు రమేష్ వైపు చూస్తూ "హా భయ్యా యిత్నే దిన్ కహాన్, ఠర్ర (గుడుంబ) పీకర్ సోయేతే క్యా ? అబ్ తుంహారే లియే యహాన్ కోయి కాం నాహి హై" గోళ్ళు గిల్లకుంటూ నిలుచున్నాడు కుక్. బుస కొడుతున్న పాములా... మళ్లీ "ఏ గెస్ట్‌హౌస్ హై ఆప్ కా ససురాల్ నహీ, జీ చాహే ఆయా కరో" సర్ కోపాగ్నికి తట్టుకోలేక పోతున్నాడు పాపం కుక్. నేను జోక్యం చేసుకుని మెల్లిగా "సర్, అతని భార్య మలేరియాతో బాధ పడుతుంది..." పూర్తి చేసేముందే, "క్యా బాత్ హై జిల్లా జీ, యిన్‌కి బహూత్ వకాలత్ కర్ రహే హూ ఆప్.. ! నౌక్రీ కీ తమీజ్ నహీ యినే" అని కసురుకుంటు సీట్‌లో నుండి లేచి వెళ్ళిపోయాడు సర్. యిదే అదనుగా లోనికి వెళ్లి పని చూసుకో అని సైగ చేసాను నేను కుక్‌కి. గాలి దుమారం తర్వాత ప్రశాంతం ! శ్రీకాంత్ నా వైపు చూసి ఒక స్మైల్ యిచ్చాడు. మొత్తానికి ఒక పేద వాడి ఉద్యోగం నిలబెట్టానని శభాస్ అని కాబోలు ఒక మూడు నెలలు గడిచాయి.

త్వరలోనే రెండవ బ్యాచ్ అసిస్టేంట్ కమీషనర్‌ల ప్రమోషన్ల వార్త విని నేను, ముంబై ఆఫీస్ పోస్టింగ్ కోసం, ట్రాన్స్ఫర్ అప్లికేషన్ పంపాను. మా ఢిల్లీ ఆఫీస్ వాళ్ళకు, ముంబై, థానేలో ఈ క్యాడరు పోస్టులు ఖాళీగా ఉండటంతో, నా విన్నపం మంజూరయి, థానే పోస్టింగ్ యిచ్చారు. ఆగస్టు 2009లో హెడ్ ఆఫీస్ ఆర్డర్ వచ్చాక వారం రోజులకు, మరో కొత్త ఆఫీసరు జాయిన్ అయ్యాక నన్ను రిలీవ్ చేశారు. యింత త్వరగా స్వంత ఊరు పోస్టింగ్ యివ్వడం చాలా అరుదు. కానీ ఆ వార్త విని రమేష్ కుక్ సంతోషంగా లేనట్టు గమనించాను. శుక్రవారం సాయంత్రం 3.50కి ఇందోర్ ముంబై సెంట్రల్ అవంతిక ఎక్స్‌ప్రెస్‌లో నా తిరుగు ప్రయాణం.

ఆ రోజు ఉదయం మా ఆర్.సీ. గారి క్యాబిన్‌లో, తోటి ఆఫీసర్లు కలిసి సెండాఫ్ ట్రీట్, ఆ తర్వాత నా సెక్షన్ స్టాఫ్ అందరూ కలిసి సత్కారం చేశారు. వారితో గడిపింది పది నెలల కాలం అయినా, ఏన్నో ఏళ్ల పెనవేసుకున్న బంధం లాంటి ఫీలింగ్, శ్రీకాంత్ గారు, మా కేర్టేకర్‌లు స్టేషన్‌కు సెండాప్‌కి వచ్చారు. ట్రైన్ కదలటానికి ఒక పది నిమిషాల ముందు... ముఖమంతా చెమటలు కారుతుండటంతో, ఆయాస పడుతూ, నావైపు చూస్తూ ఉన్నాడు రమేష్. శ్రీకాంత్‌తో కబుర్లాడుతున్న నేను అటువైపు చూసి, నాకోసమే ఎదురు చూస్తున్న కుక్‌ని పిలిచా. నా దగ్గరకు వచ్చి చేతిలోని స్టీల్ టిఫిన్ కారీర్ నాకందిస్తూ "రాత్ కా భోజన్ సాబ్" అంటూ చేతులు జోడించా డు. అతని అభిమానానికి నేను, పర్సులో నుండి ఒక అయిదు వందల నోటు తీసి యివ్వబోతుంటే "వద్దు సార్, మీకు యివ్వ వలసిన మూడు వేలు తిరిగి యివ్వలేక పోయాను. గెస్ట్‌హౌస్‌లో ఊడిపోయే నా ఉద్యోగం మీరు కాపాడారు. మీ ఋణం తీర్చు కోలేక పోతున్నాను" అంటూ వంగి నా పాద స్పర్శ చేయబోతుంటే వారించి దగ్గరకు తీసుకుంటూ " ఆలా అనుకో కు రమేష్ ఒక సాటి మనిషి ఆపదలో ఉంటే ఆదుకున్నాను. అంతే యిందులో నా గొప్పతనం ఏమీ లేదు, నీకు చేసిన సహాయానికి ప్రతిఫలంగా భగవంతుడు తొందరగా యింటికి పంపిస్తున్నాడుగా" అంటూ నవ్వా "మీది చాలా మంచి మనసు సార్ భగవంతుడు మిమ్మల్ని ఎప్పుడూ చల్లగా చూస్తాడు" అంటూ చేతులు జోడించి నమస్కారం చేశాడు. ట్రైన్ గార్డు విజిల్ మోగటంతో నేను నా సీటులో కెళ్ళి కూర్చున్నాను. రైలు కదలటంతో కిటికీలో నుండి చూద్దును గదా, జోడించిన చేతులు, కళ్ల నిండా నీళ్లతో నావైపే దయనీయంగా చూస్తున్న రమేష్ చౌహాన్. ఆ దృశ్యం పదేళ్లు దాట వస్తున్నా, నా మనో ఫలకం మీద చెరగని ముద్రలా నిలిచి పోయింది. మన క్షేమం కొరకు రోజూ దేవునికి దణ్ణం పెట్టుకుంటూనే ఉంటాము కాని మన కోసం యితరులు దేవునికి దణ్ణం పెట్టడం అదృష్టమే మరి!!

❀❀❀

# వాట్సాప్ వాణి

వి.వి. లక్ష్మీనారాయణ
మాజీ జే.డీ. (సి.బి.ఐ.)

ఒక ఊరిలో ఓ రైతు ఉన్నాడు. అతనికో ఇల్లు ఉంది. ఆ రైతు తనతో పాటు ఒక కోడిని, ఒక మేకను పెంచుకుంటున్నాడు. ఆ ఇంట్లో ఒక ఎలుక కూడా తిరుగుతుండేది. ఆ ఊరిలోనే గ్రామస్థుల అవసరాలకు ఒక చెరువు ఉంది. దానిలో ఒక మొసలి నివాసం ఉంటుంది.

కొన్నాళ్ళ తరువాత ఆ రైతుకి వివాహమై బార్య కాపురానికి వచ్చింది. ఆవిడకి ఆ ఇంట్లో ఎలుక తిరగడం నచ్చలేదు. ఆ విషయమే భర్తకి చెప్పింది. ఎలుకను చంపడానికి బోను తీసుకురమ్మని చెప్పింది. మరుసటి రోజే రైతు ఓ ఎలుకల బోను తీసుకొచ్చి ఇంట్లో పెట్టాడు. జరిగిన తతంగాన్ని చూసిన ఎలుక భయపడింది. ఎలాగైనా ఈ సమస్య నుండి బయటపడటానికి ఏదో ఒకటి చేయాలి అనుకుంది. ముందుగా కోడి దగ్గరకు వెళ్ళి ఇలా అడిగింది

"నేను ఇంతవరకూ ఈ రైతుకి ఏ విధమైన నష్టం కలిగించే పని చెయ్యలేదు. ఏదో నా మానాన నేను బతుకుతున్నాను ఇక మీదట కూడా వారి జోలికి రాను. నన్ను చంపవద్దని చెప్పు" అని ప్రాధేయపడి అడిగింది.

దానికి ఆ కోడి చిద్విలాసంగా.... "అది నీ వ్యక్తిగత విషయం, దానితో నాకేమిటి సంబంధం, నీ సమస్య నువ్వే పరిష్కరించుకో..." అని సమాధానం చెప్పింది.

అప్పుడు ఆ ఎలుక మేకని ఆశ్రయించి అడిగింది. దానికి ఆ మేక కూడా... "అది నీ సమస్య,,, దానిని నువ్వే సరిచేసుకోవాలి నాకు సంబంధంలేదు" అని బదులిచ్చింది. చేసేదేమీ లేక ఎలుక చివరిగా చెరువు దగ్గరకు వెళ్ళి మొసలిని కూడ అడిగింది... ఎలాగైనా రైతును ఒప్పించి నన్ను కాపాడు నేను ఏ పొరపాటు చెయ్యను అని అడిగింది. అప్పుడు ఆ మొసలి కూడ "నాకు సంబంధం లేదంటూ..." అలాగే మాట్లాడింది.

ఏదయితే అదే జరుగుతుందిలే అనుకుని ఎలుక తిరిగి ఇంటికి వచ్చేసింది. ఆ రాత్రి ప్రొద్దుపోయాక పెద్ద శబ్దంతో బోను తలుపు మూసుకుంది. వెంటనే రైతు భార్య ఎలుక చిక్కింది అనుకుంటూ చీకట్లో తడుముకుంటూ బోను దగ్గరకు వెళ్ళింది కానీ... దానిలో దూరింది ఎలుక కాదు. అది ఓ పాము...

ఆవిడ దగ్గరకు రాగానే అది ఆమె చేతి మీద కాటేసింది. ఆవిడ ఆరుపుకి అందరూ లేచి వచ్చారు. ఆమెను ఓ మంచం మీద పెట్టి డాక్టర్‌ని పిలుచుకొచ్చారు. ట్రీట్మెంట్ మొదలైంది. రోజులు గడుస్తున్నాయి. అందరూ వచ్చి పలకరించి వెళుతున్నారు. చుట్టాలు రావటం మొదలైంది. ఇలా కొన్ని రోజులు గడిచాయి. వైద్యం జరుగుతూనే ఉంది. వచ్చిన చుట్టాలకీ మర్యాదలు చేయటానికి ఓ రోజు ఆ రైతు తను పెంచుకున్న కోడిని కోసి వండి పెట్టాడు. ఎలుక మాత్రం అక్కడే వుంది. మరికొన్ని రోజులు గడిచాయి. వైద్యం జరుగుతోంది. చుట్టాలు ఇంకా ఎక్కువ మంది వచ్చారు. వారి కోసమని ఆ రైతు మేకని కోసి పలావు చేసి పెట్టాడు. ఎలుక మాత్రం ఇంకా ఆ ఇంట్లో తిరుగుతూనే వుంది. వైద్యం జరుగుతుందో. కాని ఆమె కోలుకోలేదు. లాభం లేదని పొరుగూరు నుండి మరో వైద్యుడిని పిలిపించారు. ఆ వైద్యుడు ఆమెను చూసి...  మరేమి పర్వాలేదు. నేను ఈమెను బ్రతికిస్తాను కానీ... వైద్యానికి నాకు మొసలి రక్తం కావాలి అన్నాడు. దానితో అందరూ వెళ్ళి చెరువులో ఉన్న మొసలిని పట్టుకుని చంపి దాని రక్తం తీసుకొచ్చి వైద్యునికి ఇచ్చారు. రైతు భార్యకి నయమైంది.

కోడి చచ్చింది.

మేక కూడా చచ్చింది.

చివరకి మొసలీ చచ్చింది.

కానీ... ఆ ఎలుక మాత్రం అక్కడే ఉంది.

మన సమాజమూ ఇలాగే ఉంది. ఎవరికి వారే నాకేమిటి సంబంధం అనుకుంటే.. చివరకి వారు కూడా...!!!!



# క్యాన్సర్ పై గెలుపు



27 సంవత్సరాలకే ఎంతో పేరు, ప్రతిష్టలు, ధనం సంపాదించిన ఆ వ్యక్తికి క్యాన్సర్ కారణంగా రోజులు లెక్కబెడుతూ మరణాన్ని చేరుకోవలసిన పరిస్థితి ...

అతని పేరు అమిత్ వైద్య, గుజరాతి, యు.ఎస్ లోనే పుట్టి పెరిగాడు. పిహెచ్‌డి ఎకనామిక్స్, మంచి కంపనిలో ఉద్యోగం.

"నేను చురుకైన వ్యక్తినే కాని నా జీవితమంతా ఆరోగ్యకరమైన రీతిలో ఉన్నది కాదు" అని అనిత్ చెప్పేవాడు, తన జీవితమంతా కలతలు, విషాదాలతోనే ఎక్కువ నిండివుండేవి. ఎప్పుడయితే తన తండ్రి క్యాన్సర్ కారణంగా చనిపోయారో అప్పటినుండి "నేను నా 27వ ఏట ఉన్నతమైన జీవితంలో ఉన్నప్పుడు కలిగిన పెద్ద పతనం" అని అమిత్ చెప్పాడు. తన తండ్రికి సుమారు రెండేళ్లు అన్ని రకాల ట్రీట్మెంట్స్ చేసినా కూడా ప్రయోజనం లేకుండా పోయింది. ఆయన చనిపోయారు. ఆ తదుపరి తన తల్లికి కూడా క్యాన్సర్. తండ్రి ఎడబాటుకి రెండు నెలల గడువులోనే తల్లి అకాలమరణం అమిత్‌ను తీరని విషాదంలోకి నెట్టేశాయి.

"స్వదేశానికి చాలా దూరంగా బ్రతుకుతున్న నాకు ఇప్పుడు ఒంటరితనం మరింత భారంగా మారింది. ఎందుకంటే నాకు కూడా క్యాన్సర్ ఉంది. 18 నెలల క్రితం చేసిన పరీక్షలు వచ్చాయి. ఇప్పుడు క్యాన్సర్ లివర్‌కు చేరింది. 9 నెలల తరువాత వచ్చిన రిపోర్టుల్లో 2011లో క్యాన్సర్ ఊపిరితిత్తులకు వ్యాపించింది" అంటూ అమిత్ చాలా విచారకరంగా తన బాధల్ని ఒకానొక సందర్భంలో వెల్లడించారు డాక్టర్స్ చాలా తక్కువ రోజలు మాత్రమే అమిత్ జీవిం చడానికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. " నేను నా జీవితం లో ఎవ్వరికీ ఇబ్బంది పెట్టకూడదని నిర్ణయించుకున్నాను. నా అంతిమ క్రియలకు కూడా ఏర్పాట్లు చేసుకు న్నాను. చావుని స్వాగతించడంలో నాకు భయంలేదు. నా తల్లి నా కళ్లెదురుగా మరణించిన తీరు నాకు చావు పట్ల భయం లేకుండాచేసింది. ఇది ఒక సినిమాటెక్ సందర్భంగా అనిపించ వచ్చు. కాని నా తల్లిదండ్రులు నాకు దూరమయ్యాక ఇక ఉన్న ఈ జీవితం పట్ల నాకు ఎటువంటి ఆసక్తి లేదు" అని అమిత్ చెప్పాడు.

కాని చనిపోయేముందు ఒక్కసారి భారత్‌కు రావాలని నిర్ణయించుకున్నాడు అమిత్. తన తల్లిదండ్రులు భారత్‌లో పుట్టి యు.ఎస్. లో తనువులు చాలించారు. ఇక విదేశంలో పుట్టిన అమిత్ తన స్వదేశంలో చివరి ఊపిరిని వీడాలని నిశ్చయించుకున్నాడు. భారత్‌లో అడుగుపెట్టి అక్కడున్న బంధువులను కలిశాడు. అప్పటికే తీవ్ర అనారోగ్యం అమిత్‌ను వెంటాడుతోంది శరీరం సహకరించని స్థితి. కాని బంధువులంతా వారి వారి జీవిత సమస్యల్లో ఉన్నారు. అందుకే చేదోడు లభించలేదు వారి ఇంటి తలుపులు మూసుకున్నాయి.

"నేను ఢిల్లోలో ఉన్నప్పుడు కొన్ని ప్రత్యామ్నాయ ఉపాయాలు చెప్పిన నా స్నేహితుడి మాటలు నాకు గుర్తుకు వచ్చాక నాక్కూడా జీవించాలనే ఆశ కలిగింది. ఒకావిడ నాకు కేవలం ఒక్క రూపాయి ఖర్చుతో కూడిన ఆయుర్వేద వైద్య విధానాన్ని పరిచయం చేశారు. ఎలాగూ బ్రతుకుతాను అనే నమ్మకంలేదు, కాని పోయే ముందు బతకడానికి ఒక ప్రయత్నంగా ఇది భావించాను" అని అమిత్ చెప్పాడు.

అక్కడికి అమిత్ చేరుకున్నాక, యోగ, ధ్యానం వంటివి సాధన చేసాడు. ప్రతి రోజు ఆవుపాలు, పెరుగు, గోసంబంధిత ఇతర పదార్థాలను సేవించేవాడు. గోమూత్రమును కూడా తన మెడికేషన్‌లో భాగంగా వాడాడు. అది కూడా పరగడుపున. ఇంతకు ముందు చేదు ఇంగ్లీష్ ఔషధాలు వాడిన అతనికి ఇక్కడ గోసంబంధిత పదార్థాలు పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. ఏదో విశ్వాసంతో చేసిన ఈ పని అతడికి పెద్దగా ఫలితం ఇచ్చినట్లు కనిపించకపోయినా అతడు నిరాశపడలేదు. అయితే కొన్ని రోజులు తరువాత స్కానింగ్ రిపోర్టులు వచ్చాయి. అందులో క్యాన్సర్ వ్యాప్తి నిరోధించబడినట్లు తెలింది. ఇంకో 40 రోజులు అదనంగా ఆయుష్షు పెరిగిందని డాక్టర్లు అంచనా వేశారు. అంతేకాదు అప్పటి వరకు ఉన్న క్యాన్సర్ కూడా తగ్గుతుందని తెలింది. అంతే అదే గో సంబంధిత ఔషధాలను అమిత్ కొనసాగిం చాడు. అక్కడే ఒక రైతును ఆశ్రయించి ఒక ఇల్లు తీసుకుని, గోశాల కూడా ఏర్పాటు చేసుకున్నాడు. అందులో దేశీయ ఆవులను పెంచాడు. ఆ గ్రామస్తులు అతనికి బాగా సహకరించా రు. 18 నెలలు గడిచాయి. ఎందరో డాక్టర్లు బ్రతికించలేని తనను ఒక గోవు బ్రతికించింది. తన అంత్యక్రియలను ముందుగానే ఏర్పాటు చేసుకున్న వ్యక్తి ఈ రోజు పూర్తి ఆరోగ్యంతో జీవిస్తున్నా రు. అంతేకాదు తనలాగ క్యాన్సర్ బాధితులకు స్వయం సేవలను అందిస్తున్నాడు. అక్కడ అంతా ఉచితమే ఆయన స్థాపించిన ఎన్‌జిఓ పేరే "హీలింగ్ వైద్య" అతను తిరిగి మళ్లీ యు.ఎస్ కు వెళ్లలేదు. "భరతమాత, గోమాత నాకు చాలా ఇచ్చాయి నేను ఇక్కడే ఉండాలి" అని అమిత్ చాలా గర్వంగా చెబుతాడు. అమిత్ రాసిన పుస్తకం Holy Cancer - How A Cow Saved My Life లో చాలా విషయాలు రాశాడు.

ఇక్కడ మనం తెలుసు కోవలసిన విషయం ఒక్క గోవు ఉంటేనే క్యాన్సర్‌లాంటి మహ మ్మారి జయించాడు అమిత్ మరి దేశంలో ప్రతి ఇంటికి గోమాత ఆశీర్వాదం ఉంటే ఈ భారత్ ఆరోగ్య భారత్, ఐశ్వర్య భారత్ గా మారుతుంది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఆరోగ్య చిట్కాలు

# ఇవి మీకు తెలుసా

- అల్లం తింటే ఎక్కిళ్ళు తగ్గుతాయి.
- కరివేపాకు రక్తహీనతను తగ్గిస్తుంది.
- నేరేడు పండ్ల గింజల్లో ఉండే జంటోలిన్ అనే గ్లూకోసైట్, మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది.
- గుమ్మడికాయ మూత్ర సంబంధిత వ్యాధులను తగ్గిస్తుంది.
- అవకాడో ఫలాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి తరచుగా తింటే మలబద్ధకం పోతుంది.
- జామపళ్ళు హార్మోన్ల హెచ్చుతగ్గులను నివారిస్తాయి.
- బ్లాక్ టీ మధుహాన్ని దూరంగా ఉంచుతుంది.
- సజ్జల్ని ఎక్కువగా తీసుకుంటే, ఫైల్స్ బాధ నుంచి ఉపశమనం లభిస్తుంది.
- మామిడిపండుకి మూత్రపిండాల్లోని రాళ్ళను కరిగించే శక్తి ఉంది.
- బీట్‌రూట్ బీపిని క్రమబద్ధికరిస్తుంది
- మునగాకు తింటే గ్యాస్ట్రిక్ సమస్యల నుండి విముక్తి లబిస్తుంది
- దానిమ్మరసం కామెర్లకు మంచి మందుగా పనిచేస్తుంది.
- ఆవాల్ని క్రమం తప్పకుండా తీసుకుంటే ఇన్సులిన్ వృద్ధి చెందుతుంది.
- అల్లం కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. మలబద్ధకాన్ని కూడా వదిలిస్తుంది
- కీరదోసలో ఉండే సిలికాన్, సల్ఫర్‌లు శిరోజాలకు మేలు చేస్తాయి
- మునగాకు గ్యాస్ట్రిక్ అల్సర్‌ని దరికి చేరనివ్వదు.
- ద్రాక్షలో అధికపాళ్ళలో ఉండే బోరాన్... ఆస్టియో పొరాసిస్ కుండా కాపాడుతుంది.
- బీట్‌రూట్ రసం లో బీపి సమస్య నుంచి గట్టేక్కిస్తుంది
- క్యారెట్ జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది.
- మూత్రపిండాల వ్యాధులున్న వారికి మొక్కజోన్న నుంచి ఔషధం.
- ఉల్లిపాయ శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తాయి.
- పుచ్చకాయలో ఉండే లైకొఫిన్... గుండె, చర్మ సంబందిత వ్యాధుల నుంచి కాపాడుతుంది.
- సపోటాపళ్ళు మలబద్ధకాన్ని నివారిస్తాయి.
- దాల్చిన చెక్కకు పంటి నొప్పిని తగ్గించే శక్తి ఉంది.
- ఆవాలు అజీర్తిని తగ్గిస్తాయి
- చేపలు తింటే రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయి
- కమలాఫలాలు న్యుమోనియాకు చక్కని మందు.
- క్యారెట్లు నరాల బలహీనత నుండి కాపాడతాయి
- యాపిల్ తింటే నిద్ర బాగా పడుతుందని పరిశోధనలో తెలింది.
- వాము దంత వ్యాధులను తగ్గిస్తుంది
- పచ్చి జామకాయలో ఉండే టానిన్ మాలిక్, ఆక్సాలిన్ ఆమ్లాలు నోటి దుర్వాసనను పోగోడుతాయి
- ఉలవలు ఊభకాయాన్ని తగ్గిస్తాయి
- ఖర్జూరం మూత్ర సంబంధిత వ్యాధుల్ని తగ్గించి, మూత్రం సాఫీగా అయ్యేలా చేస్తుంది.
- ద్రాక్షలో ఉండే పైటోకెమికల్స్...కొలెస్ట్రాల్‌ని దరి చేరనివ్వవు
- జామపళ్ళు ఎక్కువగా తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- ప్రోస్టేట్ క్యాన్సర్ సోకకుండా అడ్డుకునే శక్తి టోమాటోలకు ఉంది
- నేరేడు పళ్ళు తింటే కడుపులో పురుగులు చచ్చిపోతాయి. మొలల వ్యాధికి బొప్పాయి మంచి మందు
- మునగ కాయలు ఆకలిని పెంచుతాయి

పై నిషయాలను దృష్టిలో పెట్టుకుని మందులకు దూరంగా ఉందాం రోగ నిరోధక శక్తిని పెంచుకుందాం....

## అందమైన జీవితం

తొలిదైవం ... తల్లిదండ్రులు
మంచిరోజు ... ఈ రోజే
మంచి గుణం ... మన్నించేగుణం
నీలో రాకూడనిది ... విరక్తి
నీలో ఉండవల్సినది ... ఓర్పు, బుద్ధి

భయంకరమైన రోగం ... అత్యాశ
నీచమైనది ... ఈర్ష్య
నమ్మకూడనివి ... వదంతులు
ఆపదను తెచ్చేది ... అతివాగుడు

చేయకూడనిది ... ద్రోహం
చేయవలసినది ... సహాయం
వొదిలేయవలసినది ... వాదన
వదలకూడనిది ... స్నేహం
గుర్తుంచుకోవలసినది ... మనకు చేసిన మేలు